# APPSC ఆంధ్రప్రదేశ్ జాగ్రఫీ

Group-I, II, IV, J.L, D.L.

1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు 20 జిల్లాలు మాత్రమే ఉండగా ప్రస్తుతం 23 జిల్లాలు ఉన్నాయి. 2,36,254 చ.కి.మీల విస్తీర్ణం కలిగి భారతదేశ వైశాల్యంలో 8.4 శాతం విస్తీర్ణంతో భారతదేశంలోనే 4వ పెద్ద రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. ఆంధ్రప్రదేశ్ 12°ల14 ల నుంచి 19°ల 54 ల ఉత్తర అక్షాంశముల మధ్య 76°ల 50 ల నుంచి 84°ల 50 ల తూర్పు రేఖాంశముల మధ్య విస్తరించి ఉంది. 82 1/2 °ల తూర్పు రేఖాంశాన్ని భారత కాలమానంగా తీసుకున్నారు. ఇది మన రాష్ట్రంలో కాకినాడ గుండా ప్రయాణిస్తుంది. ఆంధ్రప్రదేశ్ విశాలమైన తీర ప్రాంతాన్ని కలిగి ఉంది. 972 కి.మీల పొడవైన తీరరేఖతో దేశంలో రెండవ స్థానాన్ని ఆక్రమించింది.

## నైసర్గిక స్వరూపం

ఆంధ్రప్రదేశ్ నైసర్గిక స్వరూపాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి:

1. కోస్తా మైదానం లేదా తీరమైదానం
2. తూర్పు కనుమలు
3. దక్కన్ పీఠభూమి

**కోస్తామైదానం**

కోస్తా మైదానం మన దేశంలో పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు విస్తరించింది. దీని పొడవు 972 కి.మీ. ఈ మైదానం రాష్ట్రంలో ఉత్తరాన శ్రీకాకుళం నుంచి దక్షిణాన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరకు వ్యాపించింది. తూర్పు కనుమలు, బంగాళాఖాతపు తీరరేఖకు మధ్య గల విశాల మైదానాన్ని కోస్తా మైదానంగా చెప్తుకోవచ్చు. ఈ మైదానం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో వ్యాపించి ఉంది.

దక్షిణ తీర మైదానంలో పెన్నా డెల్టా ప్రాంతం ఉంది. దీనికి దిగువన దక్షిణ ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాల మధ్య 'పులికాట్' లెగూన్ ఏర్పడింది. లెగూన్ అనగా సముద్రపు జలం భూభాగంలోకి చొచ్చుకు వచ్చి సరస్సుగా ఏర్పడటం. లెగూన్ సమీపంలో ఏర్పడిన శ్రీహరికోట దీవిలో సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం ఉంది. ఈ దీవి నెల్లూరు జిల్లాలో ఉంది.

**తూర్పు కనుమలు**

తూర్పు కనుమలు ఒరిస్సా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా తమిళనాడు వరకు విస్తరించింది. మనరాష్ట్రంలో తీర మైదానం, దక్కన్‌లో భాగమైన తెలంగాణా పీఠభూమికి మధ్య ఉత్తర, దక్షిణంగా విస్తరించాయి. తూర్పు కనుమలకు వివిధ జిల్లాల్లో స్థానిక పేర్లు ఉన్నాయి. పలు జిల్లాల్లో కొన్ని ముఖ్యమైన కొండలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలతో ప్రాధాన్యత పొందాయి. విశాఖపట్నం జిల్లాలో సిం హాచలం కొండలు, యారాద కొండ, అనంతగిరి కొండలు ముఖ్యమైనవి. సింహాచలం కొండలలో ప్రసిద్ధ లక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రం కలదు. ఈ జిల్లాలో అరకు లోయ ప్రముఖ వేసవి విడిది కేంద్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడ నివశించే గిరిజనుల నాట్యం 'థింసా' చాలా ప్రసిద్ధి చెందింది. ఈ జిల్లాలోని బొర్రా గుహలు కూడా ప్రసిద్ధి చెందినవే.

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాల్లో పాపి కొండలు విస్తరించాయి. వీటి మధ్యలో నుంచి గోదావరి తెలంగాణా పీఠభూమి నుంచి తీర మైదానంలోకి పశ్చిమ గోదావరిలోని పోలవరం వద్ద ప్రవేశిస్తుంది.

కృష్ణా జిల్లాలో మొగల్‌రాజపురం, కొండపల్లి కొండలు, గుంటూరు జిల్లాలో బెల్లంకొండ, గనికొండ, నాగార్జునకొండ, వినుకొండ, కొండవీటికొండ, చీమకుర్తి కొండ, మంగళగిరి కొండలు, నెల్లూరు- కడప జిల్లాల సరిహద్దుల్లో వెలికొండలు, చిత్తూరు జిల్లాలో శేషాచలం కొండలు, ఆవులపల్లి కొండలు, హార్స్‌లీ కొండలు (ఏనుగు మల్లమ్మ కొండలు) కడపలో పాలకొండలు, అనంతపూర్‌లో మల్లప్పకొండ, మడకసిర, పెనుకొండలు, కర్నూలులో నల్లమల కొండలు ప్రసిద్ధి చెందాయి.

గుంటూరు జిల్లాలోని కోటప్పకొండపై ప్రసిద్ధ శైవ క్షేత్రముంది. మంగళగిరి కొండలపై పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. వెలికొండల్లో భాగమైన నెల్లూరు జిల్లాలోని గరుడాచలం కొండల్లో పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. చిత్తూరులో శేషాచలం కొండలపై గల తిరుమలలో ప్రపంచ ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది.

చిత్తూరు జిల్లా మదనపల్లిలో హార్స్‌లీ హిల్స్ ప్రముఖ వేసవివిడిది కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. నల్లమల కొండలలో కృష్ణాతీరంలో శ్రీశైలం అవతరించింది. ద్వాదశ లింగాల్లో దక్షిణ భారతదేశంలో నెలకొన్న ఏకైక క్షేత్రమిదే.

**దక్కన్ పీఠభూమి**

ఆంధ్రప్రదేశ్‌లో దక్కన్ పీఠభూమి 150-600 మీ.ల సమోన్నత రేఖల మధ్య విస్తరించి ఉంది. ఇది తెలంగాణ పీఠభూమి, మైసూరు పీఠభూమి ప్రాంతాలలో విస్తరించి గ్రానైట్, ఆర్కియాన్ నీస్ శిలలతో కూడి ఉంది.

## శీతోష్ణస్థితి

ఆంధ్రప్రదేశ్ అయన రేఖా ప్రాంతపు ఋతుపవన శీతోష్ణస్థితి కలిగి ఉంది. పశ్చిమ ప్రాంతంలో అర్ధశుష్క శీతోష్ణస్థితి, తూర్పు తీరంలో ఆర్ద్ర శీతోష్ణస్థితి ఇలా విభిన్న శీతోష్ణస్థితులను కలిగి ఉంది. గుంటూరు జిల్లాలో రెంటచింతల, కరీంనగర్ జిల్లాలో రామగుండం మొదలైన ప్రాంతాల్లో వేసవిలో అత్యధికంగా 45 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో జూన్ - అక్టోబర్ కాలంలో 66 శాతం వర్షం సంభవిస్తుంది. మిగతా వర్షం నవంబర్-డిసెంబర్ మాసాల్లో ఈశాన్య పవనాల వల్ల కురుస్తుంది. కనుక వర్షపాతపు విస్తృతిలో చాలా వ్యత్యాసాలు కనిపిస్తాయి. రాష్ట్ర ఉత్తర భాగాన ఉన్న సీలేరు, శబరి లోయల్లో 140 -152 సెం.మీ. వర్షం కురుస్తుంది. అదే రాష్ట్ర నైరుతి దిశలో ఉన్న హగరిలోయలో 51 సెం.మీ. కంటే తక్కువ వర్షం కురుస్తుంది. సముద్ర తీర ప్రాంతాల్లో 100-114 సెం.మీ. వర్షం కురుస్తుంది. పీఠభూమి ప్రాంతంలో వర్షం 76 సెం.మీ. ఉంటుంది. నైరుతి, ఈశాన్య రుతుపవనాల వల్ల సముద్ర తీరం పొడవునా అధిక వర్షపాతం సంభవిస్తుంది. వీటిల్లో ఈశాన్య రుతుపవనాల వల్ల గోదావరి డెల్టా దిగువ కోస్తా తీరంలో అధిక వర్షం సంభవిస్తుంది. తీరానికి బాగా లోపల ఉన్న ప్రాంతానికి తూర్పు కనుమలు అడ్డుగా ఉన్నందువల్ల ఇక్కడ అల్ప వర్షపాతమే సంభవిస్తుంది. తూర్పు కనుమలు నైరుతి రుతుపవనాలకు అడ్డంగా ఉండి, సముద్ర తీర మైదానాల్లో కావలసినంత వర్షం కురవడమే కాకుండా, వెనకకు వచ్చే రుతుపవనాలు పీఠభూమిని చేరనీయకుండా కూడా చేస్తాయి. తెలంగాణాలో అధికభాగం వర్షం 63-100 సెం.మీ. వరకు ఉంటుంది. రాయలసీమ అత్యధిక భాగంలో 76 సెం.మీ.ల కంటే తక్కువ వర్షం కురుస్తుంది.



## నదులు

దక్షిణ భారత దేశంలోని ప్రధాన నదులన్నీ మన రాష్ట్రం గుండా ప్రవహిస్తున్నాయి. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌ను నదుల రాష్ట్రం అంటారు. గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, భీమ, మంజీరా, సువర్ణముఖి, వంశధార, నాగావళి, ప్రాణహిత తదితర నదులు రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ భూభాగం వాయవ్యాన ఎత్తుగా ఉండి ఆగ్నేయ దిశగా వాలి ఉంది. కనుక రాష్ట్రంలో ప్రవహించే ప్రధాన నదులు సాధారణంగా వాయవ్య దిశ నుండి ఆగ్నేయ దిశకు ప్రవహిస్తున్నాయి. ఉదాహరణకు కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర, భీమ, మంజీరా తదితర నదులు. ఇవి కర్నాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో పుట్టినప్పటికీ, మన రాష్ట్రం గుండా పయనిస్తూ చివరకు బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. తూర్పు కనుమల్లో వర్షపాతం తక్కువ కనుక వీటిలో జన్మించిన నదుల్లో జల పరిమాణం స్వల్పం. ఈ కనుమలు సముద్రానికి దగ్గరగా ఉండటం వల్ల వీటి పొడవు కూడా తక్కువే.

### గోదావరి

దేశంలో ప్రవహించే అతిపెద్ద నదుల్లో రెండవ పెద్ద నది గోదావరి. దక్షిణ భారత దేశంలో ప్రవహించే అతిపెద్ద నది. అంతేకాకుండా ద్వీపకల్ప నదుల్లో కూడా పొడవైన నది, మన రాష్ట్రం లో అతిపెద్ద నది కూడా ఇదే కావడం విశేషం.

గోదావరి మొత్తం పొడవు 1584 కి.మీ. దీని పరివాహక ప్రాంతం మన రాష్ట్రంలో 27 శాతం ఆక్రమిస్తోంది. ఈ నది మన రాష్ట్రంలో 770 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. 1852 సంవత్సరంలో ప్రముఖ ఆంగ్లేయ ఇంజనీరు సర్ ఆర్థర్ కాటన్ ఈ నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించాడు. మంజీర, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరులు ప్రధాన ఉపనదులు.

గోదావరి నదిని దక్షిణ గంగ, రైన్ ఆఫ్ ఇండియా అని కూడా అంటారు. దీని జన్మస్థానం మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో పశ్చిమ కనుమల్లో గల త్రయంబకం. ఆంధ్రప్రదేశ్‌లో కి అదిలాబాద్ జిల్లాలోని బాసర వద్ద ప్రవేశిస్తుంది. బాసర సరస్వతి క్షేత్రానికి ప్రసిద్ధి. దేశంలో ఇక్కడ, జమ్మూలో మాత్రమే సరస్వతి క్షేత్రాలున్నాయి. అదిలాబాద్ జిల్లా పడమటి సరిహద్దు వద్ద మంజీరా నదిని గోదావరి నది తనలో కలుపుకుంటుంది. అదిలాబాద్ తూర్పు సరిహద్దుగా ప్రవహిస్తూ వచ్చే ప్రాణహిత నది అదిలాబాద్, కరీంనగర్ జిల్లా సరిహద్దున గోదావరిలో కలుస్తుంది. కరీంనగర్ జిల్లా తూర్పు సరిహద్దుగా కొంత దూరం వరకు గోదావరి తూర్పు దిశగా ప్రవహించి ఇంద్రావతి నదిని కలుపుకుంటుంది. తర్వాత వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా ప్రవహించి పాపికొండల్లో బైసన్ గార్జ్ గుండా ప్రవహిస్తూ చివరకు, పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలవరం వద్ద మైదానంలోకి ప్రవేశిస్తుంది. తర్వాత గోదావరి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దుగా ప్రవహించి రాజమండ్రికి దిగువునా పలు పాయలుగా చీలి చివరకు తూర్పు గోదావరి జిల్లాలో బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ పాయల్లో వైనతేయ, వశిష్ట, గౌతమీలు చాల ప్రసిద్ధి చెందాయి. ఉత్తర పాయ లేదా శాఖ అయిన గౌతమీ యానాం వద్ద సముద్రంలో కలుస్తుంది. మధ్యపాయ లేదా శాఖ అయిన వశిష్ట నరసాపురం సమీపంలోని అంతర్వేది వద్ద సముద్రంలో కలుస్తుంది. దక్షిణ శాఖ లేదా పాయ అయిన వైనతేయ కొమరిగిరిపట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మరో రెండు పాయలైన తుల్య, భరద్వాజ శాఖలు బెండమూరు లంక వద్ద సముద్రంలో కలుస్తున్నాయి.

### కృష్ణా

దేశంలో ప్రవహించే అతిపెద్ద నదుల్లో మూడవది కృష్ణా. దక్షిణ భారత దేశంలో ప్రవహించే రెండవ అతిపెద్ద నది. మన రాష్ట్రం లో రెండవ అతిపెద్ద నది కూడా ఇదే కావడం విశేషం.

కృష్ణా నది మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని పశ్చిమ కనుమల్లో గల మహాబలేశ్వర్‌లో జన్మిస్తుంది. అనంతరం కర్నాటక రాష్ట్రం గుండా పయనించి, మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ తంగడి వద్ద ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుండి మహబూబ్ నగర్, కర్నూలు, నల్లగొండ, గుంటూరు, కృష్ణా జిల్లా సరిహద్దుగా ప్రవహిస్తుంది. చివరకు ఇది కృష్ణా జిల్లాలో హం సల దీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

తుంగభద్ర, దిండి, పాలేరు, కోయనా, వర్ధ, పంచగంగ, మూసి, భీమ, ఘటప్రభ, మున్నేరు కృష్ణా ప్రధాన నదులు. కృష్ణా మొత్తం పొడవు 1440 కి.మీ. కృష్ణా జిల్లాలోని విజయవాడ వద్ద 1852లో ప్రముఖ ఆంగ్లేయ ఇంజనీర్ అయిన సర్ ఆర్థర్ కాటన్ ఈ నదిపై ఆనకట్టను నిర్మించాడు. నల్గొండ జిల్లా నందికొండ వద్ద ఈ నదిపై దేశంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో ఒకటైన నాగార్జున సాగరను నిర్మించారు.

విజయవాడకు దిగువున 64 కి.మీ. దిగువున పులిగడ్డ వద్ద కృష్ణానది రెండు పాయలుగా చీలి మళ్లీ ఒకటిగా కలుస్తోంది. పులిగడ్డనే దివిసీమ లేదా అవనిగడ్డ అని కూడా అంటారు. మళ్లీ ఈ ప్రాంతం నుంచి 24 కి.మీ. దిగువున కృష్ణానది మూడు పాయలుగా చీలి చివరకు బంగాళాఖాతంలో కలుస్తుంది.

### పెన్నా (పినాకిని)

పెన్నా నది మన రాష్ట్రంలో మూడవ పెద్ద నది. వర్షపాతం తక్కువగా గల రాయలసీమలో ప్రధాన నది. ఇది కర్నాటకలోని కోలార్ జిల్లాలో గల నందికొండల్లో జన్మిస్తుంది. అనంతపూర్ జిల్లా హిందూపూర్ వద్ద ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహిస్తుంది. అనంతరం కడప, నెల్లూరు జిల్లాల గుండా తూర్పు దిశగా ప్రవహిస్తుంది. నెల్లూరు జిల్లాలోని ఊటుకూరు వద్ద సముద్రంలో కలుస్తుంది. కుందేరు, చిత్రావతి, జయమంగళ, పాపఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ప్రధాన ఉపనదులు. పెన్నా నది పొడవు 600 కి.మీ. రాష్ట్రంలోని దీని పరివాహక ప్రాంతం 18.3 శాతం ఉంది.

### మంజీర

మంజీర గోదావరికి ప్రధాన ఉపనది. ఇది మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని బాలాఘాట్ పర్వతాల్లో జన్మిస్తుంది. అక్కడ నుంచి ఆగ్నేయ దిశగా పయనించి ఆంధ్రప్రదేశ్‌లోకి మెదక్ జిల్లా ద్వారా ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి నిజామాబాద్‌లో కొంత దూరం ప్రయాణం చేసి గోదావరిలో కలుస్తుంది. మంజీర మొత్తం పొడవు 644 కి.మీ. నిజామ్‌సాగర్ ప్రాజెక్టును ఈ నదిపై నిర్మించారు.

### తుంగభద్ర

తుంగభద్ర కృష్ణానదికి ప్రధాన ఉపనది. తుంగ, భద్ర అనే రెండు నదుల కలయిక వల్ల తుంగభద్ర ఏర్పడింది. ఇది కర్నాటకలోని పశ్చిమ కనుమల్లో కెనరా, మైసూరు జిల్లాల సరిహద్దుల్లో గల వరాహ పర్వతాల్లో జన్మిస్తుంది. కర్నూలు జిల్లాలో కృష్ణానదిలో కలుస్తోంది. దీని ఉపనదుల్లో హగరి పెద్దది.

### కొల్లేరు సరస్సు

ఇది మంచినీటి సరస్సు. ఇది కృష్ణా గోదావరి డెల్టాల మధ్య విస్తరించి ఉంది. 260 కి.మీల వైశాల్యంతో ఉన్న కొల్లేరు సరస్సును తమ్మిలేరు, బుడమలేరు నదులు కలుస్తాయి.

### పులికాట్ సరస్సు

ఇది ఉప్పునీటి సరస్సు నెల్లూరు జిల్లాలో పెన్నా డెల్టా ప్రాంతంలో విస్తరించి ఉంది.

### నీటి పారుదల

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధాన రాష్ట్రమైనందున నీటి పారుదలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గోదావరి, కృష్ణ, పెన్నా, వంశధార, నాగావళి మొదలైన నదుల ద్వారా సంవత్సరానికి 2750 టిఎంసిల నీరు లభిస్తుంది. గోదావరి, కృష్ణా నదులు మొత్తం నదీ పరివాహక ప్రాంతంలో 50 శాతానికి పైగా ఆక్రమించాయి. రాష్ట్రంలోని ముఖ్య ప్రాజెక్టుల వివరాలను పరిశీలిద్దాం.

## నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ను నల్గొండ జిల్లాలో నంది కొండ గ్రామానికి 2 కి.మీ.ల దిగువున నిర్మించారు. ఇది రాష్ట్రంలో అతిపెద్ద నీటిపారుదల ప్రాజెక్ట్. ప్రాజెక్ట్‌కు 1955లో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేశారు. 1956లో పని ప్రారంభమైంది. 1977లో పూర్తయింది. పునాది నుండి డ్యామ్ ఎత్తు 112 మీ. ఈ ప్రాజెక్ట్ కింద 8.95 లక్షల హెక్టార్ల ఆయకట్టు కల్పించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించి రెండు ప్రధాన కాలువలు - జవహర్ కాలువ, లాల్ బహదూర్ కాలువలున్నాయి. కుడికాలువ అయిన జవహర్ కాలువ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11.79 లక్షల ఎకరాలకు లబ్ధి చేకూరుతుంది. ఈ కాలువ పొడవు 202.80 కి.మీ. ప్రధాన కాలువ నుండి ఆరు బ్రాంచి కాలువలు చీలిపోతున్నాయి. లాల్ బహదూర్ కాలువ కింద ఎడమవైపున నల్గొండ, కృష్ణా, ఖమ్మం జిల్లాల్లో 10.4 లక్షల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుంది. దీని పొడవు 178 కి.మీ. వివిధ బ్రాంచి కాలువల పేర్లతో మరో 118 కి.మీ. పొడిగించారు.

## శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్

నిజామాబాద్ జిల్లాలో పోచంపాడు గ్రామం వద్ద గోదావరి నదిపై శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. దీనిని పోచంపాడు ప్రాజెక్ట్ అని కూడా అంటారు. తెలంగాణాలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లాల్లో 4.11 హెక్టార్ల ఆయకట్టుకు నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించారు. దీని దక్షిణ కాలువ కాకతీయ కాలువ. ఈ కాలువ పొడవు 113 కి.మీ. ఈ ప్రాజెక్ట్ ద్వారా హెక్టార్ల ప్రాంతానికి నీటిపారుదల సౌకర్యాలను కలుగజేయడానికి మానేరు నదీ జలాలను సంపూర్ణంగా వినియోగించాలని నిర్ణయించారు. ఇందుకు మానేరు నదిపై కరీంనగర్ జిల్లా కేంద్రం వద్ద రిజర్వాయర్‌ను నిర్మించి, హుజురాబాద్ వరకు దాదాపు 225 కి.మీ. వరకు కాకతీయ కాలువను పొడిగించారు. హన్మకొండ, వరంగల్ పట్టణాలకు మంచినీటి సరఫరా చేసేందుకు ఈ కాలువను 235 కి.మీ. వరకు పొడిగించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల వరంగల్ ప్రాంతానికి మంచి నీటి కొరత తీరింది. రామగుం డంలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, భారతీయ ఎరువుల సంస్థలకు నీటిని సరఫరా చేస్తుంది.

## సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ ప్రాజెక్ట్

సర్ అర్థర్ కాటన్ బ్యారేజ్ ప్రాజెక్ట్ కింద గోదావరి నదిపై నాలుగు పాయల (ధవళేశ్వరం, ర్యాలీ, మద్దూరు, విజ్జేశ్వరం)లలో బ్యారేజ్‌ను నిర్మించారు. ధవళేశ్వరం పాత ఆనకట్టకు దిగువున ఈ కొత్త బ్యారేజ్ స్థలం ఉంది. ప్రపంచ బ్యాంక్ ఈ పథకానికి రుణం మంజూరు చేసింది.

## శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం ప్రాజెక్టును కృష్ణానదిపై కర్నూలు జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలం వద్ద నిర్మించారు. ఇది ప్రధానంగా నీటి పారుదల, విద్యుశ్చక్తిల కోసం నిర్మించారు. కుడి కాలువ కర్నూలు, కడప జిల్లాలకు, ఎడమ కాలువ నల్గొండ జిల్లాకు నీరు అందిస్తుంది.

## తుంగభద్ర ప్రాజెక్ట్

ఇందులో రెండు ప్రాజెక్ట్‌లున్నాయి. మొదటిది అయిన తుంగభద్ర ప్రాజెక్ట్ దిగువస్థాయి కాలువ నిర్మాణాన్ని 1945లో హైదరాబాద్, మద్రాస్ ప్రభుత్వాలు ఉమ్మడిగా ప్రారంభించాయి. ఇది 1957-58లో పూర్తయింది. దీని వల్ల ఆంధ్రప్రదేశ్‌లో 63,000 హెక్టార్ల భూమి సాగవుతోంది. ఇక రెండవది అయిన తుంగభద్ర ఎగువ కాలువ నిర్మాణాన్ని రెండు దశలలో పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్‌ను 1956-57లో ప్రారంభించి, 1972లో పూర్తి చేశారు. 1966లో రెండవ దశ ప్రారంభమైంది. ఈ దశ కింద 50,000 హెక్టార్ల భూమికి సాగునీటిని అందించాలని నిర్ణయించారు.

## ప్రకాశం బ్యారేజ్

ఆయకట్టు ప్రాంతాలను వరదల నుండి తప్పించడానికి 1952లో ఈ ఆనకట్టను నిర్మించారు. దీనిని రోడ్డు వంతెన రెగ్యులేటర్‌గా కృష్ణానదిపై నిర్మించారు.

## కర్నూలు - కడప కాలువ

కర్నూలు-కడప కాలువ 1863లో ప్రారంభమై 1866 లో ముగిసింది. ఈ కాలువ సుంకేశుల వద్ద తుంగభద్ర ఆనకట్ట నుండి ప్రారంభమై నీటి ఎద్దడి అధికంగా గల కర్నూలు, కడప జిల్లాల్లోని దాదాపు నాలుగువేల హెక్టార్లకు నీటిని అందిస్తుంది. ఇది ప్రస్తుతం 1.2 లక్షల హెక్టార్లకు నీరును అందిస్తుంది. ఇంతకు ముందు కోస్తా జిల్లాల్లో కాలువల ద్వారా, తెలంగాణాలో చెరువుల ద్వారా, రాయలసీమలో బావుల ద్వారా వ్యవసాయం జరుగుతుండేది. కాలక్రమంలో కాలువల ప్రాముఖ్యత తగ్గకున్నప్పటికీ, చెరువుల ప్రాముఖ్యత తగ్గి బావుల ద్వారా వ్యవసాయాభివృద్ధి జరిగింది.

## ఇతర ప్రాజెక్టులు

విశాఖపట్నం జిల్లాలో నర్సీపట్నం సమీపంలోని తాండవ నదిపై 1965లో తాండవ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. దీని వల్ల 18.56 వేల హెక్టార్లకు నీటి వసతి లభిస్తుంది. గుంటూరు ఛానల్ పథకం కింద నిర్మించిన కాలువ ప్రకాశం బ్యారేజికి ఎగువన ప్రయాణించి, కుడివైపున ప్రవహించి, గుంటూరు జిల్లాలో 10,000 హెక్టార్ల భూమికి నీటి వసతిని కల్పిస్తుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గల ఊకచిట్టవాగు పథకం ద్వారా 2,678 హెక్టార్ల భూమికి నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. జంఝావతి రబ్బరు ప్రాజెక్ట్‌ను విజయనగరంలో నిర్మించారు. ఆసియాలో ఈ తరహా ప్రాజెక్ట్ ఇది ఒక్కటే కావడం గమనార్హం. దీనిని ఆస్ట్రియా సాంకేతిక సహకారంతో నిర్మించారు.



కరీంనగర్ జిల్లాలోని కోనారావు పేటలో గోదావరి నదికి ఉపనది అయిన మూలవాగుపై ఆనకట్టను నిర్మించారు. దీని ద్వారా 1280 హెక్టార్ల భూమి సాగులోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని మహేంద్ర తనయ నదిపై పైడిగామ్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ మూలంగా 2011 హె క్టార్ల భూమికి నీటిపారుదల సౌకర్యం ఏర్పడింది. అనంతపూర్ జిల్లాలో కళ్యాణ దుర్గం సమీపంలోని భైరవానితిప్ప గ్రామం వద్ద నిర్మించిన ఆనకట్ట ద్వారా 7,272 హెక్టార్ల భూములు సాగులోకి వచ్చాయి. అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలోని పేరూర్ వద్ద పెన్నానదిపై నిర్మించిన ఎగువ పెన్నార్ ప్రాజెక్ట్ ద్వారా 3,800 హెక్టార్లకు నీటిపారుదల సౌకర్యం కలిగింది. మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణా నదిపై ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ ఉంది. మెదక్ జిల్లాలో మంజీరా నదిపై సింగూర్ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇది హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల మంచినీటి కొరతను తీరుస్తుంది.

## సోమశిలా ప్రాజెక్టు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పెన్నా నదిపై కలువాయి మండలంలో నిర్మించిన సోమశిల ప్రాజెక్ట్ నెల్లూరు డెల్టాకు శాశ్వతంగా నీటి వసతిని కల్పించడానికి, నెల్లూరుకు దక్షిణంగా ఉన్న భూములను ఆయకట్టు కిందికి తెచ్చేందుకు ఈ ఆనకట్టను నిర్మించారు. దీని వల్ల 44 వేల హెక్టార్ల భూమికి నీటిపారుదల సౌకర్యాలను కల్పించవచ్చు.

## పోలవరం ప్రాజెక్టు

పోలవరం ప్రాజెక్ట్‌ను పశ్చిమ గోదావరి జిల్లాలో పోలవరం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తారు. ఇది బహుళార్థసాధక ప్రాజెక్ట్. దీని ఎత్తు 150 అడుగులు. రాతి-మట్టితో కట్టే ఆనకట్ట. విశాఖ ఉక్కు కర్మాగారం, విశాఖపట్నానికి ఈ ప్రాజెక్ట్ ద్వారా మంచినీటిని సరఫరా చేయవచ్చు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వరదలను అరికట్టవచ్చు.

## తెలుగు గంగ

తెలుగుగంగ ప్రాజెక్ట్‌ను రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు నీటి పారుదల సౌకర్యాలను కల్పించడానికి, చెన్నైకు మంచినీటిని సరఫరా చేయడానికి ఉద్దేశించారు. ప్రాజెక్ట్ ద్వారా శ్రీశైలం నుండి కాలవలను తవ్వి, నీటిని సరఫరా చేస్తున్నారు.

## ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు

ఇచ్ఛంపల్లి ప్రాజెక్ట్ ప్రణాళికను 19వ శతాబ్దంలోనే సర్ అర్థర్ కాటన్ రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ అమల్లోకి వస్తే, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిఅల్లలోని వ్యవసాయ భూములకు నీటిపారుదల సౌకర్యాలు ఏర్పడతాయి. తరచుగా సంభవించే గోదావరి నది వరదలను అరికట్టడానికి ఇది ఎంతో తోడ్పడుతుంది. ఇది మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి ప్రాజెక్ట్.

## విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు

రాష్ట్రంలోని ప్రధాన విద్యుశ్చక్తి ప్రాజెక్టుల వివరాలు కింది విధంగా ఉన్నాయి.

| ప్రాజెక్టు | నది | నిర్మించిన ప్రదేశం |
|---|---|---|
| నాగార్జున సాగర్ | కృష్ణానది | నాగార్జున సాగర్ |
| శ్రీశైలం | కృష్ణానది | శ్రీశైలం |
| మాచ్‌ఖండ్ | మాచ్‌ఖండ్ | డుడుమ జలపాతం |
| తుంగభద్ర | తుంగభద్ర | అంధ్రా, కర్ణాటక సంయుక్త ప్రాజెక్టు |
| ఎగువ సీలేరు | మాచ్‌ఖండ్ | చింతపల్లి |
| దిగువ సీలేరు | సీలేరు | భద్రాచలం |
| నిజాంసాగర్ | మంజీరా | అచ్చంపేట |

బలిమెల, పోలవరం, జూరాల, ఇచ్ఛంపల్లి, సింగూరు, ముద్దునూరు, పెన్నా, అహోబిలం జల విద్యుత్ కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి.

## థర్మల్ విద్యుత్ కేంద్రాలు

విజయవాడ థర్మల్ విద్యుత్ కేంద్రం (విటిపిఎస్) - ఇబ్రహీంపట్నం
రామగుండం సూపర్ థర్మల్ స్టేషన్ - రామగుండం
రామగుండం థర్మల్ కేంద్రం - పాల్వంచ
నెల్లూరు థర్మల్ కేంద్రం - నెల్లూరు

ప్రైవేటురంగంలో కొండపల్లి(నాఫ్తా), విశాఖపట్నం, కృష్ణపట్నం, రామగుండం(థర్మల్), జేగురుపాడు, కాకినాడ(సహజ వాయువు ఆధారిత ప్రాజెక్టు)లలో విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి.

## వ్యవసాయం

మన రాష్ట్ర ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. జనాభాలో 74 శాతం గ్రామాల్లో వ్యయసాయం ప్రధాన వృత్తిగా ఉంది. వీరు వ్యవసాయ సంబంధ పరిశ్రమలకు ముడిపదార్థాలను సరఫరా చేస్తున్నారు. అధిక జనాభాకు ప్రాథమిక రంగమైన వ్యవసాయ రంగం వృత్తిపరమైన ఉద్యోగాలను కల్పిస్తోంది. రాష్ట్ర ఆదాయంలో సుమారు 40 శాతం ఆదాయం కేవలం ఒక్క వ్యవసాయ రంగం మీద నుంచే వస్తోంది. కనుక ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారత ధాన్యాగారంగానూ, అన్నపూర్ణగానూ పిలుస్తారు. మన రాష్ట్రంలో 130.43 లక్షల హెక్టార్ల సాగు భూమి ఉంది. దీనిలో నికర సాగుభూమి 107.11 లక్షల హెక్టార్లు.

మన రాష్ట్రంలో వివిధ పంటలను పండిస్తారు. వ్యవసాయ రంగంలో అగ్రగామి రాష్ట్రాల్లో మన రాష్ట్రం కూడా ఒకటి. ప్రధానంగా తీర ప్రాంతాలైన కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి డెల్టా ప్రాంతాల్లో ఇతర జిల్లాలతో పోల్చినట్లయితే, నీటిపారుదల వసతులు, సారవంతమైన భూములు అధికం. అంతేకాకుండా అధిక పంటలు పండుతున్నాయి. వర్షపాతం తక్కువగా ఉండి, సారవంత భూములు లేని రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో కూడా అహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగానే ఉంది.

ఆహార ధాన్యాల సాగుదల, ఉత్పత్తులు, ఉత్పాదకతల దృష్ట్యా 66.5 శాతం ఖరీఫ్ కాలంలోనూ, 33.5 శాతం రబీకాలంలోనూ పండిస్తున్నారు. కేవలం వరి, జొన్న పంటలు రాష్ట్ర ఆహార ధాన్యోత్పత్తిలో 66.5 శాతం ఉన్నాయి. సాగు విస్తీర్ణంలో ఆహార పంటలు పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యధికంకాగా, కడప జిల్లాలో అత్యల్పంగా ఉన్నాయి. నీటి ఎద్దడికి గురవుతున్న రాయలసీమ జిల్లాలు మిగతా జిల్లాల కంటే ఆహారేతర పంటలను పండిస్తున్నాయి.రాష్ట్రంలో ఆహార పంటల కింద వరి, వాణిజ్య పంటల కింద వేరు శనగసాగు అధికం. వరిసాగు రాష్ట్రంలో చెరువుల ద్వారా అధికం, అలాగే వ్యాపార పంట అయిన వేరుశనగ సాగు బావుల కింద అధికం.

## ఆహారపు పంటలు

ఆహారానికి ఉపయోగించే పంటలను ఆహార పంటలు అంటారు. వరి, గోధుమ, జొన్న, మొక్కజొన్న, సజ్జ, రాగులు మొదలైనవి ఆహార పంటలు. ఆంధ్రప్రదేశ్‌కు ఆహారపు పంటల్లో 70 శాతం ఉత్పత్తి వరి నుండి వస్తుంది.

## వరి

మన దేశంలో వరి పండే విస్తీర్ణంలో మన రాష్ట్రం నాల్గవ స్థానం ఆక్రమించింది. వరిపంట దిగుబడిలో, ఉత్పాదకతలో పశ్చిమ గోదావరి జిల్లా దేశంలో ప్రథమ స్థానాన్ని ఆక్రమిస్తుంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, అంధ్రప్రదేశ్ నీటిపారుదల వసతులతో అన్ని జిల్లాల్లో పండించే పంటగా వరి ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. వరి పంటలో 75 శాతం పంట ఖరీఫ్ కాలంలో పండుతుంది. వరి సాధారణంగా కాలువలు, చెరువులు కింద నీటిపారుదల సౌకర్యాలు గల ప్రాంతాల్లో అధికంగా పండుతుంది. కొన్ని వర్షాధారా ప్రాంతాల్లో మెట్టపంటగాకూడా పండుతుంది. రాష్ట్రంలో వరి దిగుబడి హెక్టారుకు 2524 కిలోలు ఉంది. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలో మొదటి రెండు స్థానాలను అక్రమిస్తున్నాయి.

## జొన్న

దేశంలో జొన్న పండించే భూమిలో 16.5 శాతం అంధ్రప్రదేశ్‌లో ఉంది. జొన్న పండించే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ది నాల్గవ స్థానం. రాష్ట్రంలో పండించే ప్రధాన పంటల్లో జొన్నకు రెండో స్థానం ఉంది. సాగుబడిలో ఉన్న రాష్ట్ర భూమి విస్తీర్ణంలో 18 శాతం జొన్నను పండిస్తున్నారు. మన రాష్ట్రంలో పలు రకాల జొన్నలను పండిస్తారు. వీటిలో తెల్ల, పచ్చ జొన్నలు ప్రధాన మైనవి.

తెలంగాణాలోని మహబూబ్‌నగర్, రాయలసీమలో కర్నూలు, కోస్తాలో ప్రకాశం జిల్లాలు జొన్న సాగులో మొదటి స్థానంలో ఉన్నాయి. రాష్ట్రంలో కెల్లా మహబూబ్‌నగర్ ప్రథమ స్థానంలో ఉంది. ఉత్పత్తిలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో జొన్న దిగుబడి హెక్టారుకు 726 కిలోలుగా ఉంది.

## సజ్జ

మన రాష్ట్రంలో సజ్జలను విశాఖపట్నం, ప్రకాశం, నల్గొండ, అనంతపూర్, మహబూబ్‌నగర్, నెల్లూరు, మెదక్ జిల్లాల్లో పండిస్తున్నారు. ఇది వర్షాకాలపు పంట. సజ్జల దిగుబడిలో హెక్టారుకు 1465 కిలోగ్రాములతో నెల్లూరు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది.

## మొక్కజొన్న

మొక్కజొన్న పంటను శ్రీకాకుళం, విజయనగరం, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్, ఆదిలాబాద్‌లలో పండిస్తున్నారు. ఇది ఖరీఫ్ పంట. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు అధిక దిగుబడిని సాధిస్తున్నాయి.

## రాగులు

రాగులను శ్రీకాకుళం, విశాఖపట్నం, నెల్లూరు, అనంతపూర్, కడప, చిత్తూరు, రంగారెడ్డి,మెదక్, మహబూబ్ నగర్ జిల్లాలో పండిస్తున్నారు.

## వ్యాపార పంటలు

మన రాష్ట్రంలో ఆహార పంటలతో పాటు వ్యాపార పంటలు కూడా బాగా పండుతాయి. రాష్ట్ర అవసరాలకు పోను కొన్ని ఎగుమతి కూడా అవుతున్నాయి. రాష్ట్ర వ్యాపార పంటలలో నూనెగింజలు, పత్తి, పొగాకు, చెరకు, మిర్చి, పసుపు ప్రధానమైనవి.

### నూనె పంటలు

ఆంధ్రప్రదేశ్‌లో పండే నూనె గింజల్లో వేరుశనగ, ఆముదాలు, నువ్వులు, ప్రొద్దుతిరుగుడు అత్యంత ప్రధానమైనవి. దేశంలో ఆంధ్రప్రదేశ్ వేరుశనగ విస్తీర్ణంలో రెండో స్థానాన్ని, ఉత్పత్తిలో ప్రథమ స్థానాన్ని కలిగి ఉంది. రాష్ట్రంలో వేరుశనగ విస్తీర్ణం మనదేశంలో వేరుశనగసాగు భూమిలో 22.9 శాతం ఉంది. ఖరీఫ్ పంట వర్షాధారంపై, రబీ పంట నీటిపారుదల ఆధారంతో పండిస్తున్నారు.

వేరుశనగ దాదాపు అన్ని జిల్లాల్లోను పండుతుంది. కోస్తా ప్రాంతంలో విజయనగరం, ప్రకాశం జిల్లాలు, రాయలసీమలో అన్ని జిల్లాలు, తెలంగాణా ప్రాంతం లోని మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ జిల్లాలు ప్రధానంగా వేరుశనగ పంటలను పండిస్తున్నాయి. సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో అనంతపూర్ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. దిగుబడుల దృష్ట్యా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా మొదటి స్థానం లో ఉంది. మొత్తం మీద నూనె గింజల ఉత్పత్తిలో వేరుశనగ ప్రధాన పాత్ర వహిస్తోంది.

ఆముదాల ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. దేశం మొత్తం ఆముదాల పంట సాగు విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్‌లో సాగువిస్తీర్ణం, ఉత్పత్తులు సగానికిపైగా ఉన్నాయి. ఇది వర్షాధారపు పంట. ఈ పంటను విడిగాను, మరొక పంటతో మిశ్రమంగాను పండిస్తున్నారు. జూన్-ఆగస్టు మాసాల్లో విత్తనాలు వేస్తారు. తెలంగాణాలోని మహబూబ్‌నగర్ మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోలే రాష్ట్ర ఆముదాల సాగులో 90 శాతంగా ఉన్నాయి. కోస్తాంధ్రలో కేవలం ప్రకాశం జిల్లాలోనే గుర్తించదగ్గ సాగు ఉంది. రాష్ట్రంలో పండిన ఆముదాలు రాష్ట్ర అవసరాలకు పోను మూడు వంతు పంట ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది.

మనదేశంలో ఆంధ్రప్రదేశ్ నువ్వుల పంటలో ఐదవ స్థానంలో ఉంది. నువ్వులు ఖరీఫ్ పంటగాను, రబీ పంటగాను పండిస్తారు. నువ్వులను ప్రధానంగా విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, వరంగల్, అదిలాబాద్ జిల్లాల్లో పండిస్తున్నారు. రాష్ట్రంలో ప్రొద్దుతిరుగుడు సాగు నూనెగింజల సాగులో పెద్ద మార్పుగా చెప్పవచ్చు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నీటి వసతులు తక్కువగా ఉన్న చోట నేలలతో సంబంధం లేకుండా సాగుచేస్తున్నారు. సాగులో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. తెలంగాణాలోని అన్ని జిల్లాల్లో పెద్ద పరిమాణాల్లో ఈ పంటను సాగు చేయటం జరుగుతోంది. ఇది అన్ని కాలాల్లోను పండుతుంది. పంట కాలం కూడా తక్కువే. కనుక రైతుకు నీటి వసతులు తక్కువగా ఉన్న ప్రదేశాల్లో పం డించడం సులభం.

### ఇతర వ్యాపార పంటలు

మనదేశంలో చెరకు కింద సాగయ్యే భూమిలో ఐదుశాతం మాత్రమే ఆంధ్రప్రదేశ్‌లో ఉంది. మన రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, కృష్ణా, చిత్తూరు, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో చెరకు పండుతుంది. రాష్ట్రంలోని 80 శాతం పైగా చెరకు పంటను పైజిల్లాల్లో మాత్రమే పండిస్తున్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో దిగుబడి అధికం. ఈ పంటను విస్తృతపర్చడానికి అనకాపల్లిలో ఒక పరిశోధన కేంద్రాన్ని స్థాపించారు.

ప్రత్తి సాగు భూమిలో దేశంలో మనరాష్ట్రం 7.2 శాతాన్ని, ఉత్పత్తిలో 9.8 శాతాన్ని కలిగి ఉంది. రాష్ట్ర సాగుబడి భూమిలో ప్రత్తి కింద ఉన్న భూమి 1.5 శాతం మాత్రమే కావడం గమనార్హం. ప్రత్తి ఖరీఫ్ పంటగాను, రబీ పంటగాను పండిస్తారు.కోస్తాలో గుం టూరు, ప్రకాశం జిల్లాలు, రాయలసీమలోని కర్నూలు జిల్లా, తెలంగాణాలోని అదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, కరీం నగర్ జిల్లాలు ప్రత్తిను ప్రధానంగా పండిస్తున్నాయి. రాష్ట్రంలో పొడుగు గింజ పత్తిలో సీఐలాండ్, పిఎ లక్ష్మి, వర్షని, హైదరాబాద్ 4420, నందియన్ రకాలు వివిధ జిల్లాల్లో పండుతున్నాయి. ఆంధ్ర ప్రాంతంలో వెస్టర్న్ ప్రత్తిని పెద్ద ఎత్తున పండిస్తున్నారు. రాష్ట్రంలో పండే పత్తి ఉత్పత్తిలో అధిక భాగాన్ని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. కర్నూలు జిల్లా నంద్యాలలో ఒక ప్రత్తి పరిశోధన కేం ద్రం ఉంది.

మన రాష్ట్రంలో పండే వ్యాపార పంటల్లో పొగాకు ప్రధానమైంది. దేశంలో పొగుకు పండే రాష్ట్రాల్లో ప్రథమ స్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ఆక్రమించింది. భారత దేశంలో పండే మేలైన వర్జీనియా పొగాకులో 95 శాతం మన రాష్ట్రం లోనే పండుతుంది. ఇది ప్రధానంగా రబీ కాలపు పంట. పొగాకు ముఖ్యంగా గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, నెల్లూరు, ఖమ్మం జిల్లాల్లో రాష్ట్ర పొగాకులో 90 శాతానికిపైగా పండుతుంది. పొగాకును మన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గుంటూరు దీనికి ప్రధాన కేంద్రం.

దేశంలో మిర్చి కింద సాగయ్యే భూమిలో సుమారు 25 శాతం మన రాష్ట్రంలోనే ఉంది. మిర్చి వర్షాధారంపైనా, నీటి వసరుల సాయం తోను, అన్ని జిల్లాల్లో పండుతుంది. ఖరీఫ్, రబీ రెండు పంట కాలాల్లో పండుతుంది. ఈ పంట అధికంగా గుంటూరులో పండుతుంది. రాష్ట్రంలో ఈ పంట కింద సాగయ్యే భూమి తెలంగాణాలో అధికం. గుంటూరు జిల్లా 'లామ్'లో కృష్ణా జిల్లా గన్నవరంలో మేలిరకం విత్తనాలు పెంచుతున్నారు.

మనరాష్ట్రంలో పసుపును గుంటూరు, కడప, నిజామాబాద్, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల్లో పండిస్తున్నారు. పసుపు పంట రాష్ట్ర మొత్తంలో 39 శాతం ఆంధ్ర ప్రాంతం లోను, 47 శాతం తెలంగాణా ప్రాంతంలోను, 14 శాతం రాయలసీమలోను పండుతుంది. ఆంధ్రప్రదేశ్ నుండి మహారాష్ట్రకు అధికంగా ఎగుమతి అవుతుంది.

మన రాష్ట్రంలో ఉల్లి గడ్డలు అన్ని జిల్లాల్లో పండుతున్నాయి. ముఖ్యంగా గుంటూరు, కర్నూలు, అనంతపూర్, కడప, రంగారెడ్డి జిల్లాల్లో అధికంగా పండుతుంది. రాష్ట్ర ఉల్లిపాయ పంటల్లో రాయలసీమలో 49 శాతం ఉండగా,



కోస్తా, తెలంగాణాల్లో 25 శాతం ఉంది. ఉల్లిపాయ ఇక్కడ నుండి మధ్యాసియా, దూరప్రాచ్య దేశాలకు ఎగుమతి అవుతోంది. కడప జిల్లా ఎర్రగుంట్లలో ఉల్లిపాయల పరిశోధన కేంద్రం ఉంది.

## నేలలు

ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రనేలలు, నల్ల నేలలు, ఒండ్రుమట్టి నేలలు, లేటరైట్ నేలలు మొదలైన అన్ని రకాల నేలలు ఉన్నాయి. వీనిలో 65 శాతం భౌగోళిక విస్తీర్ణంతో ఎర్ర నేలలు ఉండగా నల్ల నేలలు 25శాతం విస్తీర్ణంతో ఉన్నా యి. లేటరైట్ నేలలు 5 శాతం విస్తీర్ణం మాత్రమే కలిగి ఉన్నాయి.

### ఎర్ర నేలలు

ఎర్రనేలలు మన రాష్ట్రంలో ఇతర నేలల కంటే అత్యధిక విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నాయి. ఇవి గ్రానైట్ రాళ్ల నుండి రూపాంతరం చెంది ఎర్రనేలలుగా ఏర్పడ్డాయి. ఇవి తేలికైన నేలలు. నీటిని గ్రహించే శక్తి ఉంది. వీటిలో బంకమన్ను తక్కువగా ఉంటుంది. నీటిలో కరిగే లవణాలు 0.25 శాతానికి మించవు. సేంద్రియ పదార్థాలు, వృక్షాహార ద్రవ్యాలు లోపించి ఉంటాయి. ఇవి తెలం గాణ, రాయలసీమ ప్రాంతాల్లో అత్యధికంగా విస్తరించి ఉన్నాయి. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒండ్రు నేలలకు సమీపంలో వీటిని చూడవచ్చు. కృష్ణా జిల్లాలోని నూజివీడు, గుంటూరు జిల్లాలోని వినుకొండ, పల్నాడు తదితర ప్రాంతాల్లో ఇవి విస్తరించాయి.

ఎర్రనేలలో నీరు త్వరగా ఇంకిపోతుంది. కాపున ఈ నేలలో నల్లమట్టి, ఇతర ఎరువులు ఎప్పుడు కలుపుతూ ఉండాలి. ఫలితంగా ఎర్రనేలలో తేమ పీల్చుకునే గుణం అధికమవుతుంది. పంటలు బాగా పండే అవకాశం ఉంటుంది. ఇటువంటి నేలల్లో పెసలు, కందులు, ఉలవలు లాంటి పప్పు దినుసులు, వేరుశనగలాంటి నూనెగింజలు పండుతాయి. నీటిపారుదల సౌకర్యాలతో పండ్ల తోటలను పెం చుతారు. ఇటీవల కాలంలో ఈప్రాంతాల్లో ప్రత్తి, పొగాకు, చెరకు, వరి లాంటి పంటలను కూడా పండిస్తున్నారు. తెలంగాణాలో ఎర్ర నేలలను చల్క, దుబ్బ నేలలుగా వర్గీకరించారు.

చల్క నేలల్లో నైట్రోజన్, ఫాస్ఫరస్ ఖనిజాల శాతం చాలా తక్కువగా ఉంటుంది.. అందువల్ల వీటిని సారరహిత భూములుగా చెప్పవచ్చు. ఇవి అత్యధికంగా రాయలసీమ, దక్షిణ తెలంగాణా ప్రాంతాల్లో వ్యాపించాయి.

దుబ్బ నేలలు ఎండాకాలంలో పూర్తిగా బీడు వారిపోతాయి. దుమ్ము, ధూళి లేచిపోతూ ఉంటుంది. తక్కువ సారవంతం కలిగి, పాలిపోయిన బూడిదరంగులో ఉంటాయి. జీవసంబంధ పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. వీటిపై క్రమక్షయం అధికం. కనుక లోతుగా దున్నడం కష్టం. ఫలితంగా పంటల దిగుబడులు తక్కువ. అయితే ఇటీవల కాలంలో సహజ ఎరువులు, కృత్రిమ ఎరువులను ఉపయోగిస్తూ, అధిక దిగుబడులను సాధిస్తున్నారు.

### లాటరైట్ నేలలు

లాటరైట్ నేలలను జేగురు నేలలని కూడా అంటారు. అధిక వర్షపాతం, అధిక తేమ, ఎక్కువ ఉష్ణోగ్రత గల ప్రాంతాల్లో ఇవి తయారవుతాయి. వీటి రంగు తేలికైన పీతవర్ణంలో ఉండి, గోధుమ, ఎరుపు రంగులను కల్గి ఉంటాయి. ఈ నేలలు చాలా లోతుగా ఉంటాయి. ఈ నేలలు రెండు రకాలు- మొదటి రకం నేలలు గుట్టలు, ఎత్తైన ప్రదేశాల్లో విస్తరించి ఉన్నాయి. రెండో రకం నేలలు తీర ప్రాంతాలకు సమీపంలో లోతట్టు ప్రాంతాల్లో వ్యాపించాయి. మెదక్ జిల్లాలోని నారాయణ్‌ఖేడ్, జహీరాబాద్ మండలాలు, చిత్తూరు జిల్లాలోని సత్యవీడు, పుత్తూరు మండలాల్లోని ఎర్ర నేలలు మొదటి రకానికి చెందినవి. తూర్పు గోదావరిలోని ఎల్లవరం, పెద్దాపురం మండలాలు, నెల్లూరు జిల్లాలోని కావలి, కోవూరు, గూడూరు, సుళ్లూరుపేట మండలాలు, శ్రీకాకుళం, విశాఖపట్నం తీరానికి సమీపంలో గల ప్రాంతాలు రెండో రకానికి చెందినవి.

లాటరైట్ నేలల్లో నైట్రోజన్ అధికంగా ఉంటుంది. క్షారాలు తక్కువ. ఫాస్ఫరస్ పెంటాక్సైడ్, పొటాష్ కూడా ఉన్నాయి. అందువల్ల ఎరుపు లేదా పసుపుపచ్చతో కూడిన ఎర్ర రంగు వచ్చింది. ఈ మట్టిని భవనాల పెం కులు, ఇటుక తయారు చేయడానికి ఉపయోగిస్తున్నారు. ఇవి తక్కువ సారవంతంగల నేలలు. అయితే ఎరువుల వాడకం వల్ల మట్టి సారాన్ని పెంచి, పంటలను పండించవచ్చు. ఇవి ప్రధానంగా తోటలకు అనుకూలంగా ఉంటాయి. చింత చెట్లు, మామిడి చెట్లు, జీడిమామిడి చెట్లు ఎక్కువగా పెరుగుతాయి. అలాగే పసుపు, బంగాళాదుంప తదితర పంటలు బాగా పండుతాయి. అయితే ఈ నేలల విస్తీర్ణం మన రాష్ట్రంలో తక్కువ.

### కొండ, అటవీ నేలలు

ఇవి దాదాపు లాటరైట్ నేలలను పోలి ఉంటాయి. వీటిల్లో సేంద్రియ పదార్థాలు అధికంగా ఉంటుంది. రబ్బరు, బంగాళాదుంపలు, కాబేజీ, కాఫీ, తేయాకు తదితర పంటలు ఈ నేలలు గల భూముల్లో పండుతాయి. సరుగుడు, జీడిమామిడి తోటలు పెంచడానికి, పూలు, పండ్లు పండించడానికి చాలా అనుకూలంగా ఉంటాయి. ఈ నేలల్లో క్షార గుణం తక్కువ.

### తీరప్రాంత ఇసుక నేలలు

తీర ప్రాంత ఇసుక నేలలు ఒండ్రుమట్టితో కలిసి ఏర్పడ్డాయి. ఇవి తీర ప్రాంతం నుండి 3-12 కి.మీ. వరకు వ్యాపించాయి. కొంత వరకు లవణీయతో కలిసి ఉంటాయి. ఈ నేలల్లో నీటి మట్టం 5-15 అడుగుల లోపల ఉంటాయి. వీటిల్లో ఇసుక శాతం అధికం గాను, బంకమట్టి శాతం చాలా తక్కువగాను ఉంటుంది. అందువల్ల నీటి పారుదల సౌకర్యాలు ఉన్నట్లయితే, వరి, పొగాకు లాంటి పంటలను పండించే అవకాశాలు ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో బంకమట్టి ఎంతో లోతులో ఉంటుంది. భూగర్భ జలం చాలాపైననే ఉండటం, నీటి గ్రహణశక్తి అధికంగా ఉండటం వల్ల తుపాను, ఆటుపోటులు ఈ ప్రదేశాలను ముంచివేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కనుక ఇక్కడి భూగర్భజలం ఉప్పగా ఉంటుంది.

ఈ నేలల్లో ఇసుక అధికంగాను, బంకమట్టి తక్కువగాను ఉన్నందువల్ల ఇవి చాలావరకు బీడుభూములుగా ఏర్పడ్డాయి. కొన్ని ప్రాంతాలు చిట్టడవులుగా మారాయి. నీటిపారుదల గల ప్రాం తాల్లో ఎరువులను ఉపయోగించి, కూరగాయలు, వరి, పొగాకు పంటలను పండిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో సర్వి చెట్లు బాగా పెరుగుతాయి. ఇవి వంట చెరకుగా ఉపయోగపడతాయి. కొన్ని ఎత్తైన ప్రాంతాల్లో బంకమట్టి గల ప్రదేశాల్లో మామిడి, జీడిపప్పు తోటలు, కొబ్బరి తోటలను పెంచుతున్నారు. వీటికి కూడా సహజ ఎరువులు అవసరం.

## అడవులు

జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ వివరాల ప్రకారం మన రాష్ట్రంలో 64 వేల చ.కి.మీల విస్తీర్ణంలో అడవులు ఉన్నాయి. ఇవి మన రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 22.89 శాతం. భారత ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అటవీ విధానం ప్రకారం మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో కనీసం 33% శాతం అడవులు ఉండాలి. కానీ మన రాష్ట్రంలో అడవులు ఉండవలసిన దాని కన్నా చాలా తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. జిల్లాల వారిగా పరిశీలిస్తే 49.97 శాతంతో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా అదిలాబాద్ 43.19 శాతం, విశాఖపట్నం 42.12 శాతంతో 2, 3 స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్ 0% అడవులతో చివరి స్థానంలో ఉంది. ప్రాంతాల వారిగా చూస్తే తెలంగాణలో 45.8 శాతం, కోస్తాలో 30.6 శాతం, రాయలసీమలో 23.5 శాతం అడవులు విస్తరించి ఉన్నాయి. అడవులను ప్రధానంగా ఈ కింది రకాలుగా విభజించవచ్చు.

*1. ఆకురాల్చే అడవులు*

ఆకురాల్చే అడవులు 125-200 సెం.మీ. వర్షపాతం గల ప్రాంతాల్లో విస్తరించి ఉంటాయి. ఇవి అధికంగా మన రాష్ట్రంలో ఉత్తర ప్రాంత జిల్లాలైన శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ కొండ ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నాయి. ఈ రకమైన అడవుల్లో వేగి, ఎగిస, మద్ది, బండారు, జిట్టెగి తదితర వృక్షాలు పెరుగుతాయి.

*2. ఆకురాల్చే అనార్థ్ర అడవులు*

ఆకురాల్చే అడవులు 75-100 సెం.మీ. వర్షపాతం గల ప్రాంతాల్లో విస్తరించి ఉంటాయి. ఇవి అధికంగా మన రాష్ట్రంలో ఉత్తర తెలంగాణా ప్రాంత జిల్లాలైన అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు, రాయలసీమ జిల్లాలైన కర్నూలు, కడప జిల్లాల్లో వ్యాపించి ఉన్నాయి. ఈరకమైన అడవుల్లో మద్ది, మోదుగ, వెదురు, బూరుగు, దిరిసెన, వేప, బిల్లు, చిగురు, ఏపి, ఎగిస, వెలగ, టేకు తదితర వృక్షాలు పెరుగుతాయి. వీటి నుంచి పలు రకాల కలప లభిస్తోంది.

3. ముళ్లపొద అడవులు

ముళ్ల పొదలతో కూడిన అడవులు అల్ప వర్షపాతం గల ప్రాంతాల్లో విస్తరించి ఉంటాయి. ఇవి అధికంగా మన రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపూర్, కడప, చిత్తూరు; తెలంగాణాలోని నల్గొండ జిల్లాలో పెరుగుతాయి. ఈ రకమైన అడవుల్లో చంద్ర, బులుసురేగు, తుమ్మ తదితర వృక్షాలు పెరుగుతాయి. వీటి కలప పలు రకాల వ్యవసాయ పనిముట్లకు ఉపయోగపడుతుంది. అధిక భాగం వంట చెరుకుగా వినియోగిస్తున్నారు.

4. సముద్ర ఇసుక తీరపు అడవులు

మనరాష్ట్రంలోని తూర్పు కోస్తా తీరంలోని ఇసుకలో చామంతి, పత్రితుంగ, బాలబందితీగ, మొగలి మొక్కలు, చిన్న పొదలు, సరుగుడు చెట్లు పెరుగుతాయి.

5. ఆటుపోటు అడవులు

ఆటుపోటు అడవులు నదులు సముద్రాల్లో కలిసే నదీ ముఖ ద్వారాల్లో పెరుగుతాయి. ఈ ప్రాంతాల్లో ఉప్పుపొర, ఒండలిమట్టి, బురద కలిసి ఉంటాయి. ఈప్రాంతాల్లో జలం ఎప్పుడు ఉంటుంది కాబట్టి, నీరు ఉప్పగా ఉంటుంది. ఈజలంలో ఆక్సిజన్ ఉండదు. కనుక వాతావరణంలోని ఆక్సిజన్‌ను తీసుకునేందుకు చెట్లు వేర్లు జలంపైకి వృద్ధి చెందుతాయి. ఇటువంటి లక్షణాలు గల ఒక రకమైన జాతి చెట్లు ప్రధానంగా మడ వృక్షాలు పెరుగుతాయి. ఈ అడవులు నిరంతరం ఆటుపోటులకు గురవుతాయి. కనుక వీటిని ఆటుపోటు అడవులు అని కూడా అంటారు. లిట్టోరల్ లేదా డెల్టా లేదా కోస్తా తీర లేదా మన్‌గ్రూవ్ అడవులు అని కూడా అంటారు. ఇవి కృష్ణా, గోదావరి నదీముఖ ద్వారాల్లో పెరుగుతాయి. టెల్ల, కదిలి, గుండుమడ, తెల్లిమడ, మడ, ఉరడ, బొడ్డుపొన్న, ఉప్పుపొన్న తదితర చెట్లు ఇక్కడ పెరుగుతాయి.

సామాజిక అడవులు

వంట చెరుకు, పశుగ్రాసం, కలప, పతనమైన అడవుల్లో జరిగే క్రమక్షయ నివారణ, అడవుల్లో ఆర్థిక వనరులను సృష్టించడం కోసం సామాజిక అడవులను పెంచుతారు. సామాజిక అడవులను పెంచటం ఐదవ పంచవర్ష ప్రణాళిక కాలం నుంచి ప్రారంభమైంది. 1980–82లో మన రాష్ట్రంలో భారీ ఎత్తున చెట్ల పెంపకాన్ని ప్రారంభించారు.

నాణ్యమైన అటవీ మొక్కలను పెంచి, వాటిని అడవులు, ఇతర స్థలాల్లో సామాజిక అడవులుగా పెంచడానికి మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. మన రాష్ట్రంలో పెరిగే అడవుల నుంచి మామిడి పండ్లు, కుంకుళ్లు, లక్క, తేనె, వనమూలికలు, చెట్ల బెరడ్లు, తోళ్లు, జిగురు, చింత పండు ఉత్పత్తి అవుతున్నాయి.

## పరిశ్రమలు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చెందింది. అయితే రాష్ట్రంలోని ప్రధాన భారీ పరిశ్రమలన్నీ, హైదరాబాద్, విశాఖపట్నం చుట్టుప్రక్కల కేంద్రీకరించబడి ఉన్నాయి.

వ్యవసాయాధార భారీ పరిశ్రమలు

మన రాష్ట్రంలో అతిపెద్ద వ్యవసాయాధార పరిశ్రమల్లో వస్త్ర పరిశ్రమ, చక్కెర పరిశ్రమ, జనపనార పరిశ్రమ, పొగాకు పరిశ్రమ, నూనె పరిశ్రమ, ఆహార సంబంధిత ఇతర పరిశ్రమలు కీలకమైనవి. మన రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత అధికం. కావున ఆహార, వాణిజ్య పంటలను పెద్ద ఎత్తున పండిస్తున్నారు. వ్యవసాయ సంబం ధిత పరిశ్రమల్లో చాలా వరకు వాణిజ్య పంటలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. రాష్ట్ర ఆదాయంలో 70 శాతం వ్యవసాయ సంబంధిత పరిశ్రమల ద్వారా వస్తోంది. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వ్యవసాయాధార పరిశ్రమలతోనే ప్రారంభమైంది.

వస్త్ర పరిశ్రమ

ఆంధ్రప్రదేశ్‌లో పత్తి పంట ప్రధానంగా కోస్తా ప్రాంతంలో పండుతుంది. ముఖ్యంగా గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పండుతుంది. కోస్తా తర్వాత తెలంగాణాలో ఈ పంట విస్తారంగా పండుతుంది. రాష్ట్రంలో నీటి పారుదల ప్రాంతాలు, డెల్టా ప్రాంతాల్లో ప్రత్తి పంట రెండో పంటగా పండుతుంది.

మన రాష్ట్రంలో ఈ పరిశ్రమ అధికంగా చిత్తూరు, అనంతపూర్, కర్నూలు, రంగారెడ్డి, అదిలాబాద్ జిల్లాల్లో కేంద్రీకృతమై ఉంది. ఉపాధి కల్పనలో ఆదిలాబాద్, వరంగల్, కర్నూలు, అనంతపూర్, చిత్తూరు, ఉభయ గోదావరి జిల్లాలు ముందున్నాయి. ఆంధ్రప్రాంతంలో అభిరామ్ కాటన్ మిల్లును సూళ్లూరు పేటలో 1973లోను, జ్యోతి ప్రకాష్ స్పిన్నింగ్ మిల్స్‌ను 1982లో తడలోను, చీరాల కోఆపరేటివ్ స్పిన్నింగ్స్ మిల్స్‌ను 1963లో చీరాలలోను, హేమలత టెక్స్‌టైల్స్ మిల్స్‌ను 1550లో పెద్దకాకాని (గుంటూరు జిల్లా)లోను, విజయ స్పిన్నింగ్ మిల్స్‌ను విజయవాడలో 1967లోను, శ్రీ అక్కమాంబ టెక్స్‌టైల్స్ మిల్స్‌ను 1956లో తణుకు (పశ్చిమ గోదావరి)లోను, సర్వరాయ టెక్స్‌టైల్స్ లిమిటెడ్ 1957లో కాకినాడలో స్థాపించారు. రాయలసీమ ప్రాంతంలో కాటన్ మిల్స్ కేంద్రీకృతమై ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో నల్లరేగడి భూమి అధికం. ఈ నేలలు ప్రత్తి పం డేందుకు అనుకూలంగా ఉంటాయి. జిల్లాల వారీగా చూస్తే, చిత్తూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం ఆక్రమించింది.

సిమెంట్ పరిశ్రమ

మన రాష్ట్రంలో భారీ, మినీ కర్మాగారాలు లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నాయి. సిమెంట్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మిగులు రాష్ట్రం. సిమెంట్ ఉత్పత్తికి సున్నపురాయి, బొగ్గు నిక్షేపాలు మన రాష్ట్రంలో అపారంగా ఉన్నాయి. మన దేశపు సున్నపురాయి నిల్వల్లో 33 శాతం నిల్వలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఇక్కడ చాలా అధికంగా సిమెంట్ గ్రేడ్ సున్నపురాయి నిల్వలున్నాయి. కర్నూలు, కడప, అదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో ఈ నిల్వలు అధికంగా ఉన్నాయి. పెద్ద ప్రాజెక్టులకు అవసరమైన ముఖ్యమైన మౌలిక నిర్మాణ సామాగ్రిలో ఉక్కు, సిమెంట్‌లు కీలకమైనవి. మన రాష్ట్రంలో సిమెంట్ కర్మాగారాలు ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో విస్తరించాయి.ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్రా సిమెంట్స్ కంపెనీని 1940 సంవత్సరంలో విజయవాడలోను, అసోసియేటెడ్ కంపెనీని 1939లో తాడేపల్లి (కృష్ణా జిల్లా)లోను, కెసిపి సిమెంట్‌ను 1958 సంవత్సరంలో స్థాపించారు. తెలంగాణాలోని సిమెంట్ కర్మాగారాల్లో అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీని 1958లో మంచిర్యాల వద్ద, కేశోరామ్ సిమెంట్స్‌ను 1969లో బసంత్‌నగర్ (కరీంనగర్)లోను, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)ను అదిలాబాద్‌లోను, రాశిసిమెంట్స్‌ను నల్గొండ జిల్లాలోని వాడపల్లిలోను, దక్కన్ సిమెంట్స్‌ను హుజుర్‌నగర్ (నల్గొండ)లోను, నాగార్జున సిమెంట్స్‌ను కెట్లపల్లి (నల్గొండ)లోను స్థాపించారు. సోమేశ్వరా, ఓరియంటల్ సిమెంట్స్, అన్నాపూర్ణా సిమెంట్స్ లాంటి మిని కర్మాగారాలను వరసగా అసిఫాబాద్, దేవ్‌పూర్, అదిలాబాద్‌ల్లో స్థాపించారు. నల్గొండ జిల్లాలో కాకతీయ, ప్రియదర్శిని, రాక్‌లాండ్, విష్ణు, సాగర్ లాంటి సిమెంట్ కర్మాగారాలను స్థాపించారు.

రాయలసీమ ప్రాంతంలో 1958లో పాణ్యం సిమెంట్స్ మినరల్ ఇండస్ట్రీస్, సువర్ణ సిమెంట్స్ కర్నూలు జిల్లాలోను, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ)కు సంబంధించిన ఒక యూనిట్ కడపలోని ఎర్రగుంట్లలోను, కోరమాండల్ సిమెం ట్స్‌ను ఎర్రగుంట్లలోని చిలంకూర్‌లోను, టెక్స్‌మాకో లిమిటెడ్ కంపెనీనిఎర్రగుంట్లలోను, తాడిపత్రి సిమెంట్స్‌ను తాడిపత్రిలోను స్థాపించారు. రాష్ట్రంలో సిమెంట్ పరిశ్రమలు నల్గొండ, అదిలాబాద్, గుంటూరు, కడప, కర్నూలు జల్లాల్లో అధికంగా ఉన్నాయి. ఈ సిమెంట్ ఫ్యాక్టరీలే కాకుండా, సిమెంట్‌తో తయారు చేసే పైపులు, ట్యూబులు, అస్బెస్టాస్ రేకులు తదితర వస్తువులను తయారుచేసే ఫ్యాక్టరీలు బాగా వృద్ధి చెందాయి.


పంచదార పరిశ్రమ

చెరుకు పంట వృద్ధి, అధిక దిగుబడులు, నూతన వంగడాలు పంచదార పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేస్తాయి. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లోని డెల్టా భూముల్లో చెరకు పంట బాగా అభివృద్ధి చెందింది. రాష్ట్రం మొత్తం మీద సహకార రంగంలో చక్కెరఫ్యాక్టరీలు అధికంగా ఉన్నాయి. చెరకు పంట విస్తీర్ణం, ఉత్పత్తి, కర్మాగారాల సంఖ్య తదితర అంశాల్లో ఆంధ్ర ప్రాంతం ప్రథమ స్థానంలో ఉంది.

మన రాష్ట్రంలో ప్రధాన పంచదార కర్మాగారం బోధన్‌లోని నిజాం చక్కెర కర్మాగారం. పశ్చిమ గోదావరిలోని తణుకులో ఆంధ్రా షుగర్ ఫ్యాక్టరీని 1952లో ప్రైవేటు రంగంలో స్థాపించారు.

జనపనార పరిశ్రమ

ప్యాకింగ్ కార్యకలాపాల్లో చాలా వరకు కృత్రిమ నారతో చేసిన వస్తువులను వాడటం వల్ల జనపనారకు ప్రాముఖ్యత తగ్గిపోయింది. ఫలితంగా పంట విస్తీర్ణం, ఉత్పత్తి కూడా దెబ్బతినింది. ప్రస్తుతం మన రాష్ట్రంలో జనపనార



మిల్లులు మొత్తం ఎనిమిది ఉన్నాయి. వాటిల్లో నాలుగు యూనిట్లు విజయనగరంలో ఉన్నాయి. మిగిలిన నాలుగు యూనిట్లల్లో ఒక్కొక్కటి చొప్పున విశాఖపట్నం, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్నాయి.

పొగాకు పరిశ్రమ

ప్రపంచంలో పొగాకు ఉత్పత్తిలో మనదేశానికి ప్రథమస్థానం ఉంది. మనదేశంలో ఆంధ్రప్రదేశ్‌ను భారత దేశపు 'హవానా'గా పిలుస్తారు. గుంటూరు జిల్లాలో ప్రపంచంలోకెల్లా నాణ్యమైన పొగాకు 'వర్జీనీయా పొగాకు' లభ్యమవుతోంది.

ఇంజనీరింగ్ ఆధారిత పరిశ్రమలు

మన దేశంలో పారిశ్రామికీకరణకు ఇంజనీరింగ్ పరిశ్రమ అభివృద్ధి అవసరం. కేంద్ర ప్రభుత్వం పలు ప్రాంతాల్లో ఈ పరిశ్రమలను నిర్మించింది. హెచ్‌ఎంటీ, బిహెచ్ఇఎల్, ఇసిఐఎల్, ఆర్ఎఫ్‌సి, ఆల్విన్, హెచ్ఎఎల్, బిహెచ్‌విపి, ఎపిహెచ్ఎంఇఎల్, ఎన్ఎఫ్‌సి తదితర పరిశ్రమలు మన రాష్ట్రంలో వ్యాపించాయి. విశాఖపట్నంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్, పాల్వం చలో స్పాంజ్ ఐరన్ ప్లాంట్, హైదరాబాద్‌లో బిహెచ్ఇఎల్, హెచ్‌ఎంటీ, బిహెచ్‌పిఎల్ ఇంజనీరింగ్ పరిశ్రమలున్నాయి. విశాఖపట్నంలో హిందూస్థాన్ నౌకా నిర్మాణ కేంద్రం ప్రధానమైనది. రాష్ట్ర రాజధానిలో స్కూటర్‌ల తయారీ, బస్సుల బాడీ తయారీ, ఆటోమొబైల్ పరిశ్రమలను ఏర్పాటు చేశారు.

మనదేశంలో మొదటి నౌకా నిర్మాణ కేం ద్రాన్ని విశాఖపట్నంలో నిర్మించారు. ఈ పరిశ్రమ నిర్మాణం 1946లో ప్రారంభమైంది. రసాయన పరిశ్రమలు కూడా మన రాష్ట్రంలో బాగా అభివృద్ధి చెందాయి. అయితే ఈ పరిశ్రమలకు కావాల్సిన ముడి పదార్థాలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం.మొదటిసారిగా 1889లో సబ్బుల పరిశ్రమ ప్రారంభమైంది. హైదరాబాద్‌లో ఐడీపీఎల్ సింథటిక్స్ డ్రగ్స్ పరిశ్రమను ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన తర్వాత స్థాపించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద పరిశ్రమగా పేరు పొందింది.

ఈ రంగంలో ఉత్పత్తి అయ్యే రసాయన పదార్థాల ద్వారా కృత్రిమ ఎరువులు, కాస్టిక్‌సోడా, క్రిమి సంహారక మందులు, కాల్షియం సల్ఫైడ్, సింథటిక్ మందులు, సిలికాన్ కార్బైడ్, ఫైన్ కెమికల్స్, ప్రాణవాయువు (ఆక్సిజన్), బొగ్గుపులుసు వాయు (కార్బన్ డైఆక్సైడ్), బ్యాటరీసెల్స్ తదితర వస్తువులను తయారు చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లాలో రసాయన పరిశ్రమ కేంద్రీకృతమై ఉంది.

మన రాష్ట్రంలో పలు రసాయన ఎరువుల పరిశ్రమలు బాగా వృద్ధి చెందాయి. ఈ ఎరువులను వ్యవసాయ రంగంలో వాడటం వల్ల అధిక దిగుబడులు పొందగలిగాము. ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1980లో కరీంనగర్‌లోని రామగుండంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారు. బొగ్గు ముడి పదార్థాంగా ఉపయోగించి ఎరువును తయారు చేసిన మొదటి ఫ్యాక్టరీ ఇది. ఈ ఎరువుల కార్మాగారానికి రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్ నుండి కరెంట్‌ను, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ నుండి నీటిని, సింగరేణి గనుల నుండి బొగ్గును సరఫరా చేస్తున్నారు.

కోరమాండల్ ఎరువుల కర్మాగారాన్ని 1967లో విశాఖపట్నానికి నాలుగు కి.మీ. దూరంలో స్థాపించారు. గుంటూరు జిల్లాలోని తాడేపల్లిలో ఆంధ్ర ఫెర్టిలైజర్స్‌ను స్థాపించారు. ఆంధ్రసుగర్స్‌ను పశ్చిమ గోదావరి జిల్లాలోని కొవ్వూరులో 1961లో ఏర్పాటు చేశారు.

### వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు

| సంరక్షణ కేంద్రం | జంతువులు | విస్తరించిన జిల్లాలు |
|---|---|---|
| 1. కొల్లేరు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పక్షులు, పెల్లికన్స్ | పశ్చిమ గోదావరి |
| 2. కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | మొసళ్లు | తూర్పు గోదావరి |
| 3. పాపికొండ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పులులు, నక్కలు, పక్షులు | తూర్పు, పశ్చిమ గోదావరి |
| 4. కృష్ణా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పులి, చిరుత, దుప్పి, అడవి దున్న | కృష్ణా, గుంటూరు |
| 5. కవ్వాలీ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పులి, చిరుత, దుప్పి, పక్షులు | ఆదిలాబాద్ |
| 6. ప్రాణహిత సంరక్షణ కేంద్రం | మొసళ్లు, కోతులు, నక్కలు, మచ్చల లేడి | అదిలాబాద్ |
| 7. శివరాం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | అడవి పిల్లి, తోడేళ్లు | ఆదిలాబాద్, కరీంనగర్ |
| 8. ఏటూరు నాగారం సంరక్షణ కేంద్రం | అడవి కుక్కలు, కొండ చిలువలు | వరంగల్ |
| 9. పాకాల వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పులి, ఎలుగుబంటి, అడవిబాతు | వరంగల్ |
| 10. పోచారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | మొసళ్లు, పక్షులు | మెదక్, నిజామాబాద్ |
| 11. మంజీరా సంరక్షణ కేంద్రం | పులులు, హైనాలు | మెదక్, నిజామాబాద్ |
| 12. కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పులులు, హైనాలు | ఖమ్మం |
| 13. నాగార్జున సాగర్, శ్రీశైలం సంరక్షణ కేంద్రం | పులులు, చిరుతలు, దుప్పిలు | గుంటూరు, ప్రకాశం, మహబూబ్‌నగర్ |
| 14. శ్రీ వెంకటేశ్వర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | పులులు, హైనాలు, స్లెండర్ లోరిస్ గోల్డెన్ గికాసైకస్ బెడ్డోమి | చిత్తూరు, కడప |
| 15. కౌండిన్య వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | ఏనుగులు | చిత్తూరు |
| 16. పులికాట్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | బాతులు, నీటి కాకులు, పెలియట్స్ | నెల్లూరు |
| 17. నేలపట్టు పక్షి సంరక్షణ కేంద్రం | బూడిదరంగు పెల్లికన్స్ | నెల్లూరు |
| 18. శ్రీశైల మల్లేశ్వర వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | జెర్డన్స్ కోర్సర్ | కడప |
| 19. గుండ్ల బ్రహ్మేశ్వర సంరక్షణ కేంద్రం | | కర్నూలు |
| 20. రోళ్ళపాడు వన్యప్రాణి సంరక్షణ కేంద్రం | బట్టమేక పిట్టలు | కర్నూలు |

**విద్యుత్ ఆధార పరిశ్రమలు**

మన రాష్ట్రంలో విద్యుత్ జల విద్యుత్ ప్రాజెక్టులు, థర్మల్ ప్రాజెక్టుల నుండి విద్యుత్ జనిస్తోంది. మాచ్‌ఖండ్, తుంగభద్ర, నిజామ్‌సాగర్, నాగార్జునసాగర్, హుస్సేన్‌సాగర్, కొత్తగూడెమ్, విజయవాడ, నెల్లూరు, ఎగువసీలేరు, దిగువసీలేరు తదితర ప్రాజెక్టులు జల, థర్మల్ విద్యుత్‌ను తయారు చేస్తున్నాయి.

**అటవీ ఆధార పరిశ్రమలు**

మన రాష్ట్రంలో కాగితం పరిశ్రమ, ప్లైవుడ్, రంపపు కోత మిల్లులు ఈ పరిశ్రమ వర్గీకరణకు వస్తాయి. ముడిపదార్థాలు, వెదురు, బొగ్గు, నీరు, కరెంటు తదితర ముడిపదార్థాలు ఈ పరిశ్రమలకు అవసరం. ఇవి అధికంగా అదిలాబాద్, ఖమ్మం, తూర్పు గోదావరి, కర్నూలు జిల్లాల్లో ఉన్నాయి. అదిలాబాద్‌లోని కాగజ్ నగర్‌లో సిర్పూరు పేపర్‌మిల్స్‌ను స్థాపించారు. 1924లో రాజమండ్రిలో కర్ణాటక పేపర్ మిల్స్‌ను స్థాపించారు. 1929లో దీనిని ఆంధ్ర పేపర్ మిల్స్‌గా పేరు మార్చారు. 1979లో రాయలసీమ పేపర్ మిల్‌ను ఆదోనిలో ప్రారంభించారు.

**కలప ఆధారిత పరిశ్రమలు**

మన రాష్ట్రంలో కలప ఆధారిత పరిశ్రమలు అటవీ ప్రాంతాలకు సమీపంలో విస్తరించాయి. ఈ పరిశ్రమల్లో పేపర్ పరిశ్రమలు ప్రధాన మైనవి. అవి:

1. శ్రీరాయలసీమ పేపర్స్ మిల్స్, కర్నూలు.
2. సరిపూర్ పేపర్ మిల్స్, కాగజ్‌నగర్, ఆదిలాబాద్.
3. భద్రాచలం పేపర్‌మిల్స్, భద్రాచలం
4. ఆంధ్రప్రదేశ్ పేపర్ మిల్స్, రాజమండ్రి

ఈ పరిశ్రమల్లో వెదురు, మెత్తని కొయ్యను ప్లైవుడ్, రేయాన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఉపయోగిస్తున్నారు. ఉత్తర తెలంగాణా జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో గల అడవుల్లో చంద్రరేగు, మద్ది, టేకు, గంధకు చెక్క తదితర చెట్లు ఉన్నాయి. మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లలో సీతాఫలం చెట్లు ఉన్నాయి. నిజామాబాద్ అడవుల్లో రూసా అనే సువాసన గడ్డి లభిస్తుంది. దీనిని నుంచి మంచి సువాసన గల నూనెను తయారు చేస్తారు.

## కుటీర పరిశ్రమలు

అనాది నుండి మన రాష్ట్రంలో కుటీర పరిశ్రమలు బాగా వృద్ధి చెందాయి. బ్రిటీష్ కాలంలో ఈ పరిశ్రమలు మరుగున పడ్డాయి. ఈనాడు ప్రభుత్వం కుటీర పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహాన్ని ఇస్తోంది. ఈ పరిశ్రమల అభివృద్ధి వలన తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో సత్వర ఫలితాలను పొందవచ్చు. వీటి ద్వారా గ్రామీణులకు ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. తద్వారా నిరుద్యోగ సమస్యను నిర్మూలించవచ్చు. కుటీర పరిశ్రమల్లో ప్రధానంగా దంతపు వస్తువులు, చేనేత వస్తువులు, బొమ్మలు, పట్టు వస్త్రాలు, తివాచీలు, చాపలు, అద్దకపు గుడ్డలు తదితర వస్తువులను తయారు చేస్తున్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి పాల సేకరణ కేంద్రాలు, పాలశీతల కేంద్రాలను అన్ని జిల్లాల్లో స్థాపించారు. ఈ విధంగా మారుమూల ప్రాంతాల నుండి పాలు సేకరిస్తూ, గ్రామీణ పాల ఉత్పత్తిదారులకు లాభకరమైన గిట్టుబాటు ధర చెల్లించడం వల్ల రైతుల్లో మంచి స్పందన లభించింది. అంతేకాకుండా వివిధ వ్యవసాయ సంబంధ పథకాల్లో పాడి పరిశ్రమకు అవసరమయ్యే పరికరాల కొనుగోలుకు రుణసౌకర్యాలు లభిస్తున్నాయి. దీనితో రైతులు పాల ఉత్పత్తిని అనుబంధ వృత్తిగా ఎంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని బలహీన వర్గాల వారు, వ్యవసాయ కూలీలు, గిరిజనులు, తక్కువ భూమిగల రైతులు పాల ఉత్పత్తిని ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు.

పట్టు పరిశ్రమ వ్యవసాయ ఆధార పరిశ్రమ, అంతేకాకుండా గ్రామీణ పరిశ్రమ కూడా. దీనికి పెట్టుబడి తక్కువ. అధిక లాభాలను ఆర్జించిపెడుతుంది. మన రాష్ట్రంలో పట్టు పరిశ్రమకు అనంతపూర్ జిల్లా ప్రసిద్ధి చెందింది. హిందూపూర్, పెనుగొండ, కదిరి, గోరంట్ల ప్రాంతాలు పట్టు పరిశ్రమకు ప్రధాన కేంద్రాలు.

ఆంధ్రప్రదేశ్‌కు 974 కి.మీ. పొడవైన సముద్రతీరం ఉంది. పలు ఉపనదులతో గోదావరి, కృష్ణా, పెన్నా వంశధార లాంటి పెద్ద నదులు రాష్ట్రం గుండా ప్రవహిస్తున్నాయి. ఇంకా పలు సరస్సులు కూడా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో విస్తరించాయి. ఫలితంగా మత్స్య పరిశ్రమ మన రాష్ట్రంలో విస్తారంగా వ్యాపిం చింది. కొల్లేరు సరస్సు ప్రాంతంలో శాస్త్రీయ విధానాల ద్వారా చేపల పెంపకాన్ని అమలు చేస్తున్నారు. మన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌కు చేపలను సరఫరా చేస్తున్నారు. ఇటీవల కాలంలో రొయ్యల పెంపకం కూడా అధికమయింది. మేలు రకం రొయ్యల ను ఎగుమతి చేసి, అధిక లాభాలను అర్జించవచ్చు. దీంతో రైతులతో పాటు వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు రొయ్యల పెంపకాన్ని చేపట్టారు. రొయ్యల పెంపకానికి 'బ్రాకిష్‌వాటర్ ఏరియా' అనుకూలం. ఇది మన రాష్ట్రంలో 1.75 లక్షల ఎకరాల వరకు ఉంటుందని అం చనా.

## కుటీర పరిశ్రమల ఉనికి

1. ఏటికొప్పాక-లక్క బొమ్మలు
2. కొండపల్లి (విజయవాడ)-రంగు రంగుల బొమ్మల పరిశ్రమ
3. నిర్మల్ (ఆదిలాబాద్)-పలు రకాల బొమ్మ, లక్క బొమ్మలు
4. వరంగల్, ఏలూరు (పశ్చిమ గోదావరి), సిరిసిల్లా ( కరీంనగర్)-తివాచీలు
5. తిరుపతి-చందనపు బొమ్మలు
6. పోచంపల్లి (నల్గొండ), చీరాల (ప్రకాశం)- టై అండ్ డై స్టైల్
7. గద్వాల్ (అనంతపూర్), వెంకటగిరి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), ఉప్పాడ, ధర్మవరం (అనంతపూర్), సిద్ధిపేట (మెదక్), సిరిసిల్లా (కరీంనగర్), గుంటూరు-జరీ చీరలు
8. మహబూబ్‌నగర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా-తలిగ చాపలు
9. హైదరాబాద్, విశాఖపట్నం-దంతపు కొమ్ము
10. గుత్తి (అనంతపూర్), పాపానాయుడు పేట (చిత్తూరు), గాజుల పేట (మహబూబ్‌నగర్), సింహాచలం (విశాఖపట్నం)-పూసలు, గాజులు
11. మచిలీపట్నం (కృష్ణా)-కలంకారి అద్దకం
12. హైదరాబాద్-బిద్రీవేర్
13. హైదరాబాద్-హిమ్రూ
14. జగ్గయ్యపేట (కృష్ణా), పిఠాపురం, బొబ్బిలి- సంగీత పరికరాలు
15. పాలకొల్లు, నరసాపురం (పశ్చిమ గోదావరి-లేసులు
16. అనంతపూర్, చిత్తూరు-పట్టుపరిశ్రమ
17. అసిఫాబాద్ (అదిలాబాద్), మహాదేవ్‌పూర్(కరీంనగర్)-టస్సార్ సిల్క్
18. ఏలూరు (పశ్చిమ గోదావరి), వేటపాలెం (ప్రకాశం, హైదరాబాద్)-ఆగరుబత్తులు
19. పశ్చిమ గోదావరి, వరంగల్-నవారు
20. ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖపట్నం, శ్రీకాకళం-పీచు
21. కరీంనగర్-వెండి నగీషి వస్తువులు
22. పెంబర్తి (వరంగల్), కాళహస్తి (చిత్తూరు) - ఇత్తడి సామాగ్రి బొమ్మ

మన రాష్ట్రం పలు ఖనిజాలకు పుట్టినిల్లు. ఖనిజ నిక్షేపాలకు సంబంధించి, ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండవ స్థానాన్ని ఆక్రమించింది. బైరైటీస్, రాతినార, క్రోమైట్, బొగ్గు, ఇనుప ఖనిజం, కైనైట్, మాంగనీస్, అభ్రకం, బెరిల్, సున్నపురాయి, చైనాక్లే, రాగి ఇక్కడ దొరికే ఖనిజాల్లో ప్రధానమైనవి.

## ఖనిజ సంపద

ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తి చేసే కొన్ని ముఖ్యమైన ఖనిజాల వివరాలు ఇలా ఉన్నాయి.

### ఇనుము

ఇనుప ఖనిజ పరిశ్రమలు మన రాష్ట్రంలో అనాదిగా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో దొరికే ఇనుముతోనే ప్రపంచ ప్రఖ్యాత డమాస్కస్ కత్తులను గతంలో తయారు చేసేవారు. ఎగుమతులకు అనువైన మేలిమి రకమైన ఇనుప ధాతువు హెమటైట్, మాగ్నటైట్, లిమొనైట్‌ల్లో దొరుకుతుంది. అనంతపురం జిల్లాలోని హెమటైట్‌లో 60 శాతం ఇనుము ఉంటుంది. మిగిలిన ప్రాంతాల్లో లభించే ధాతువు నుండి ఇనుము తక్కువగా లభిస్తుంది. తెలంగాణా జిల్లాలైన ఖమ్మం, వరంగల్, కోస్తా జిల్లా అయిన కృష్ణాల్లో లభిస్తుంది. ప్రస్తుతం చిత్తూరు, కృష్ణా, కర్నూలు, ఖమ్మం జిల్లాల్లో మాత్రమే ఈ ధాతువును తీస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 60 కోట్ల టన్నుల ఇనుపధాతువు నిల్వలున్నాయని అంచనా.

### రాగి

మన రాష్ట్రంలో రాగి ధాతువు గుంటూరు జిల్లాలోని అగ్నిగుండాల, కర్నూలు జిల్లాలో ఘని, గజ్జెలకొండ, అనంతపూర్ జిల్లాలోని మడిగుబ్బల, కడప జిల్లాలోని జంగం రాజుపల్లి, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో గరిమెనపెంట ప్రాంతాల్లో లభిస్తుంది. నల్గొండ జిల్లాలోని చింతిర్యాల, ఖమ్మం జిల్లాలోని పాల్వంచ ప్రాంతాల్లో కూడా రాగి లభిస్తుంది.

### సీసం

ఆంధ్రప్రదేశ్‌లో సీసం నిల్వలు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. ఈ ఖనిజం ప్రధానంగా గుంటూరు, ఖమ్మం జిల్లాల్లో లభిస్తుంది. విశాఖపట్నంలోని హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ సంస్థ కూడా సీసం తయారు చేస్తోంది.

### బంగారం

బంగారం చాలా విలువైన ఖనిజం. చిత్తూరు జిల్లాలోని పలమనేరు వద్ద గల మాలప్పకొండ, పెద్దపర్తి కొండ ప్రాంతాల్లో బంగారపు ఖనిజాలున్నాయి. అనంతపూర్ జిల్లాలోని పెనుకొండ ప్రాంతంలో కూడా బంగారం గనులున్నాయి. అనంతపూర్ జిల్లాలోని రామగిరి గనుల నుండి భారత్ గోల్డ్‌మైన్స్ సంస్థ బంగారాన్ని వెలికితీస్తోంది. వరంగల్ జిల్లాలోని కిన్నెరసాని నదీలోయలోను, కూనవరం సమీపంలోని శబరి, గోదావరి నదీ సంగమ ప్రాంతాల్లోను ఇసకను గాలిస్తే బరువైన బంగారపు పలకలు దొరికాయి. ఈ ప్రాంతంలో కేంద్ర భూగర్భ పరిశోధన శాఖ పర్యవేక్షణ చేస్తోంది.

### వజ్రాలు

ప్రపంచ ప్రఖ్యాత వజ్రాలు కృష్ణా నదీలోయలోనే లభించాయి. కోహినూర్, రీజెంట్, పిట్, నైజామ్ తదితర వజ్రాలు ఈ కోవలోకి చెందాయి. అనంతపూర్‌లోని వజ్రకరూర్ ప్రాంతం వజ్రాల నిధులకు పేరు పొందింది. కృష్ణా జిల్లా, గుంటూరు, ఖమ్మం, కడప, అనంతపూర్‌లోని పలు ప్రాంతాల్లో వజ్రాలు దొరికే అవకాశాలున్నాయి.

### ఆస్‌బెస్టాస్

ఆస్‌బెస్టాస్ ఖనిజానికి రాయలసీమ ప్రసిద్ధి చెందింది. వీటిలో కడప జిల్లాలో చిన్నకూడాల, పులివెందుల, బ్రాహ్మణపల్లి, లోపట నూతన తదితర ప్రాంతాల్లో ఈ ఖనిజం లభిస్తుంది. ఒక్కపులివెందుల ప్రాంతంలోనే ఉత్తమ శ్రేణికి చెందిన క్రైసోలైట్ అస్బెస్టాస్ నిక్షేపాలు 27 వేల టన్నుల వరకు ఉన్నాయి. దీనిని రాతినార అని కూడా అంటారు. దేశంలో లభించే ఆస్బెస్టాస్‌లో 90 శాతం మన రాష్ట్రంలో లభిస్తుంది. అస్బెస్టాస్‌ను వస్త్రంగాను, తాళ్లుగాను నేయవచ్చు. సైనిక పరికరాల్లో ఈ ఖనిజ ప్రాముఖ్యత అధికం. అస్బెస్టాస్ సిమెంటు రేకులు, గొట్టాలు తదితర గృహనిర్మాణంలో విరివిగా ఉపయోగిస్తారు.

### బైరైటీస్

బైరైట్స్‌కు మరోపేరు ముగ్గురాళ్లు. ఈ ఖనిజాన్ని ప్రధానంగా చమురు బావుల తవ్వకంలో వెయింగ్ ఏజెంట్‌గాను, రంగులు, అచ్చుసిరా పరిశ్రమల్లోను ఉపయోగిస్తారు. ప్రధానంగా ఇరాన్, ఇరాక్, పాకిస్తాన్ దేశాల్లో పెట్రోలియం గనుల్లో ఉపయోగించడానికి ఎగుమతి అవుతోంది. ప్రపంచ ఆస్బెస్టాస్ ఖనిజ నిల్వల్లో మనదేశానికి ప్రథమ స్థానం ఉంది. దేశంలో 90 శాతం పైగా నిల్వలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయి. కడప జిల్లాలోని మంగంపేట ప్రాంతంలోని బారైట్స్ నిక్షేపాలు 746 లక్షల టన్నులు ఉంటాయని అంచనా.

### బొగ్గు

ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత దేశంలో బొగ్గును ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం. మన రాష్ట్రంలో సుమారు 1030 కోట్ల టన్ను బొగ్గు నిల్వలు ఉన్నాయని జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అంచనా వేసింది. కేవలం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మాత్రమే బొగ్గు ఖనిజ హక్కులను కలిగి ఉంది.

### బాక్సైట్

బాక్సైట్ నుంచి అల్యూమినియం వస్తుంది. కనుక దీనిని అల్యూమినియం తయారీలో వినియోగిస్తారు. మన రాష్ట్రంలో అత్యధికంగా విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లోని అనంతగిరి, చింతపల్లి ప్రాంతాల్లో ఈ ఖనిజం దొరుకుతోంది.

### బెరిల్

ఆంధ్రప్రదేశ్‌లో బెరిల్ ఖనిజం విస్తృతంగా లభిస్తోంది. వినియోగానికి కావాల్సినంత పరిమాణాల్లో బెరిల్ గూడూరు అభ్రకపు గనుల్లో లభిస్తోంది. కృష్ణా జిల్లా తిరువూరు పరిసరాల్లోను, విశాఖ పట్నం జిల్లాలోని కురుపామ్ ప్రాంతాల్లోను ఈ ఖనిజం లభిస్తోంది. కురుపామ్‌లోని కొన్ని బెరిల్ రాళ్లలో మరకతాలు (ఎమరాల్డ్) లభించాయి.

యుద్ధకాలంలో బెరిలియం ధాతు మిశ్రమాలను విమానాలు, ఓడలు, టాంకులు, తుపాకులు, విద్యు చ్ఛక్తి పరికరాల్లో కొన్ని భాగాలను తయారు చేసేందుకు ఉపయోగిస్తారు. పరమాణువు ఉత్పత్తిలో బెరిల్ నుంచి లభ్యమయ్యే బెరిలియం ధాతువు ప్రధాన ద్రవ్యం.

### సున్నపురాయి

సున్నపురాయి నిల్వలు మన రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నాయి. ఇవి సుమారు 1.38 లక్షల టన్నులు ఉన్నట్లు అంచనా. మేలైన సున్నపురాయి ప్రధానంగా కడప జిల్లాలోని జమ్మలమడుగు, మైదుకూరు ప్రాంతాల్లో లభిస్తుంది. గుంటూరు జిల్లాలోని పల్నాడు వద్ద, ఖమ్మం జిల్లాలోని చేతినపూడి, మూడితోగ, పుబల్లి, ఓస్తినాపల్లి ప్రాంతాల్లో కూడా ఈ ఖనిజం లభిస్తుంది. కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట, కర్నూలు జిల్లాలోని నందికొట్కూర్, కోయిలకుంట్ల, బంగనపల్లి, పిడుగురాళ్ల వద్ద సున్నపురాయి దొరుకుతుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కొల్లాపూర్, ఆలంపూర్, నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ, చింత్రియాలలో పెద్ద ఎత్తున లభిస్తుంది.

### అభ్రకం

అభ్రకాన్ని మైకా అని కూడా అంటారు. దీనిని ప్రధానంగా విద్యుత్ పరికరాల్లో వినియోగిస్తారు. ఇది ప్రధానంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో లభిస్తుంది. విశాఖపట్నంలో మస్కోవైట్, ఫ్లోగోపైట్ రకం అభ్రకం లభిస్తుంది. అలాగే తూర్పు గోదావరి, వరంగల్ జిల్లాల్లో గల బైసన్ పర్వత పంక్తిలో మహాదేవైట్ అనే అభ్రకాన్ని కనుగొన్నారు.

### మాంగనీస్

మాంగనీస్‌ను ప్రధానంగా ఇనుము, ఉక్కు పరిశ్రమలో ఉపయోగిస్తారు. ఈ పరిశ్రమలో అవసరమయ్యే ప్రధాన మిశ్ర లోహాల్లో మాం గనీస్ ఒకటి పొటాషి యం పర్మాంగనేట్ తదితర రసాయన పదార్థాల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తారు. మేలైన పెరాక్సైడ్ ధాతువు బ్యాటరీలను తయారు చేసేందుకు కూడా వినియోగిస్తారు.

మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో మాంగనీస్ విస్తృతంగా లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో 18 లక్షల టన్ను మాంగనీస్ నిల్వలు ఉన్నాయని అంచనా.

### క్రోమైట్

క్రోమైట్ ఖనిజం కృష్ణా జిల్లాలోని కొండపల్లి, ఖమ్మం జిల్లాలోని మధిర ప్రాంతాల్లో లభిస్తుంది. ఈ ఖనిజాన్ని స్టెయిన్‌లెస్ స్టీల్ తయారు చేయటానికి , రంగు పరిశ్రమలోను దీనిని వినియోగిస్తారు.

### బంకమట్టి (క్లే)

మన రాష్ట్రంలో వివిధ రకాల బంకమట్టి లభిస్తుంది. వీటిల్లో చాక్‌క్లే, పింగాణిమట్టి, ఫైర్‌క్లేలు ప్రధానమైనవి. విశాఖపట్నంలోని కురుపాం, తూర్పు గోదావరి జిల్లాలోని అన్నవరం, పశ్చిమ గోదావరిలోని ద్వారకా తిరుమల, నల్గొండ జిల్లాలోని చిట్యాల, నిజామాబాద్ జిల్లాలోని కోనసముద్రం ప్రాంతాల్లోను, కడప జిల్లాలోని బంకమన్ను దొరుకుతుంది. బాగా తెల్లగా ఉన్నప్పుడు ఈ బంకమట్టిని చైనా మన్ను (చైనా క్లే)గా వ్యవహరిస్తారు. దీనిని పింగాణి పరిశ్రమలో అధికంగా ఉపయోగిస్తారు. కాగితం, రబ్బరు, నూలు, పెంకు, ఇటుక పరిశ్రమల్లో కూడా బంకమన్నును అధికంగా ఉపయోగిస్తారు.

### గ్రాఫైట్

మన దేశంలో ఉత్పత్తి అవుతున్న గ్రాఫైట్‌లో 20 శాతం ఆంధ్రప్రదేశ్‌లో లభిస్తుంది. మన రాష్ట్రంలో లభించే గ్రాఫైట్ ముతక రకానికి చెందింది. వరంగల్, ఖమ్మం, కృష్ణా, ఉభయ గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో ఈ ఖనిజం అధికంగా లభిస్తుంది. గనులకు సంబంధించి, ఖమ్మం జిల్లాలోని పాల్వంచ, భద్రాచలం, పశ్చిమ గోదావరి జిల్లాలోని నాగవరంమిట్ట, విశాఖపట్నం జిల్లాలోని వెంకలపాలెం గనులు ప్రధానమైనవి.

రంగులు, మూసలు, పెన్సిల్స్ తదితర పరిశ్రమల్లో గ్రాఫైట్‌ను అధికంగా ఉపయోగిస్తారు. రాజమండ్రి, విశాఖపట్నం జిల్లాల్లో మూసల ఫ్యాక్టరీలున్నాయి.

## గార్నెట్

తెలంగాణాలోని ఖమ్మం జిల్లాలో గల గరీబుపేట, కొత్తగూడెం ప్రాంతాల్లో గార్నెట్ ఖనిజం లభిస్తుంది. కోస్తా సముద్ర తీరం ఇసుకలో ఇల్మనైట్, జిర్కాన్, మోనజైట్ ఖనిజాల్లో సానపెట్టటానికి పనికివచ్చే రకం గార్నెట్ లభిస్తుంది.

## కైనైట్

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరులో లభించే అభ్రకం గనుల ప్రాంతంలో ప్రధానంగా సైదాపురం, చుండిసత్రం సమీపంలో కైనైట్ లభిస్తుంది. ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంకు దక్షిణంగా గరీబుపేట సమీపంలో గల కనిగిరి కొండల్లో గార్నెట్‌లతో కలిసి కైనైట్ విరివిగా లభిస్తుంది.

## టాల్క్

మనదేశంలో ఉత్తమమైన టాల్క్ దొరికే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. రాష్ట్రంలో లభించే ధాతువు అత్యధిక శాతం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో లభిస్తుంది. ఉత్తమమైన టాల్క్ అనంతపురం జిల్లాలోని ముచ్చుకోట రిజర్వ్ అటవీ ప్రాంతం, తాడిపత్రి ప్రాంతాలు, కర్నూలు జిల్లాలోని ముసలాయ చెరువు, ముద్దవరం గ్రామాల్లో లభిస్తుంది.

## స్టియటైట్

మన రాష్ట్రంలో స్టియటైట్ కడప జిల్లా కొత్తగంగిరెడ్డి పల్లెలో దొరుకుతుంది. రబ్బరు, సబ్బు, రంగులు, పరిమళ ద్రవ్యాల పరిశ్రమల్లో దీనిని ఉపయోగిస్తారు.

## జిప్సమ్

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సుకు ఉత్తరాన జిప్సమ్ స్ఫటిక రూపంలో లభిస్తుంది. ఇక్కడ జిప్సమ్ ద్వారా తయారు చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను సమీపంలోని గూడూరు పింగాణీ ఫ్యాక్టరీలో మూసలు, అచ్చులు నిర్మిస్తున్నారు. సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లను తయారు చేసేందుకు జిప్సమ్‌ను ఉపయోగిస్తారు. కొన్ని సమయాల్లో సల్ఫ్యూరిక్ ఆమ్లం తయారీకి దీనిని ఉపయోగిస్తారు. అమ్మోనియం సల్ఫేట్ తదితర రసాయనిక ఎరువుల తయారీలో కూడా దీనిని ఉపయోగిస్తారు.

## పైరైటీస్

మన రాష్ట్రంలో కృష్ణా జిల్లాలో గల మచిలీపట్నం తీర ప్రాంతంలోని కోనవద్ద మాత్రమే ఈ గంధకపు ధాతువు లభిస్తుంది. కడప, కర్నూలు జిల్లాల్లో గల జమ్మలమడుగు రాళ్లలో గంధకం ఇనుముతో రసానియక సంయోగం చెంది పైరైటీస్ ఖనిజంగా లభిస్తుంది. రంగారెడ్డి జిల్లాలోని తాండూరు, కొత్తగూడెం (ఖమ్మం జిల్లా)ల్లో గల బొగ్గు గనుల్లో పైరైటీస్ లభిస్తుంది.

రసాయనిక ద్రవ్యాలు, ప్రేలుడు పదార్థాలు, కాగితం, రబ్బరు, క్రిమినాశకాలు తదితర పరిశ్రమల్లో గంధకం కీలక పాత్ర పోషిస్తోంది.

## పెట్రోలియం, గ్యాస్

పెట్రోలియం, సహజ వాయువులు అధికంగా సముద్రాల్లో ఉద్భవించిన అవక్షేప శిలా ప్రాంతాల్లో లభిస్తుంది. మన రాష్ట్రంలో కృష్ణా, గోదావరి హరివాణంలో 75,000 చ.కి.మీ. విస్తీర్ణంలో హైడ్రో కార్బన్‌లు లభిస్తాయని అంచనా. ఈప్రాంతంలో ఆయిల్ నిక్షేపాల కోసం ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కమిషన్ డ్రిల్లింగ్‌లను నిర్వహించింది. రిలయన్స్ కంపెనీ కూడా ఆయిల్‌ను వెలికి తీస్తోంది.

రాష్ట్రంలోని కృష్ణా-గోదావరి హరివాణంలో కైకలూరు, రాజోలు, చించువాడ, పీచుపాలెం, ఏనుగువాని లంక, భీమునిపల్లి, అబ్బాయగూడెం, మేదరవాని మెరక తదితర ప్రాంతాల్లో ముడి చమురు, సహజ వాయువులు బయల్పడ్డాయి. ముడి పెట్రోలియం, సహజవాయువు నుంచి పలు పదార్థాలు లభిస్తాయి. వీటి నుంచి పెట్రో కెమికల్స్ ఎరువులు, వంటగ్యాస్ తదితర ఉత్పత్తులు లభిస్తాయి.

## అణుశక్తి ఖనిజాలు

పై ఖనిజాలే కాకుండా నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ సహకారంతో మన రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో గల ఆత్మకూరు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు కనుగొన్నారు. యురేనియం ముఖ్యమైన అణుశక్తి వనరు. దీనికి అన్ని దేశాల్లో గిరాకీ చాలా ఉంది.

విశాఖపట్నం సముద్ర తీరంలో జిర్కాన్, గార్నెట్, ఇల్మనైట్‌లు, భీముని పట్నం, చింతపల్లి, ముక్కామల ఇసక దిబ్బల్లో మోనజైట్‌లు లభిస్తున్నాయి మోనజైట్ నుంచి థోరియం, ఇల్మనైట్ నుంచి టీటానియంలు లభిస్తాయి. వీటి నుంచి అణుశక్తిని ఉత్పత్తి చేయవచ్చు.

## జనాభా

2001 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 7.62 కోట్ల మంది జనాభా ఉన్నారు. భారతదేశంలో జనాభా పరంగా మన రాష్ట్రం 5 స్థానాన్ని ఆక్రమించింది.

*జనాభా లెక్కలు-2001 ముఖ్యాంశాలు*

1. రాష్ట్ర జనాభా-7.62 కోట్లు
2. పురుషుల జనాభా-3.85 కోట్లు
3. స్త్రీల జనాభా-3.76 కోట్లు
4. గ్రామీణ ప్రజలు-5.53 కోట్లు
5. పట్టణ ప్రజలు-2.08 కోట్లు
6. అత్యధిక జనాభాగల జిల్లా-తూర్పు గోదావరి (48.72 లక్షలు)
7. అత్యల్ప జనాభా గల జిల్లా-విజయనగరం (22.45 లక్షలు)
8. అక్షరాసత్య శాతం-60.47 శాతం
9. అక్షరాస్యులు-4,03,64,756
10. పురుషుల్లో అక్షరాస్యులు- 2,36,36, 077









11. మహిళల్లో అక్షరాస్యులు-1,67,28, 688
12. అత్యధిక అక్షరాస్యత గల జిల్లా-హైదరాబాద్ (79.04 శాతం)
13. అత్యల్ప అక్షరాస్యత గల జిల్లా-మహబూబ్‌నగర్ (45.53 శాతం)
14. స్త్రీల అక్షరాస్యత ఎక్కువగా గల జిల్లా- తూర్పు గోదావరి
15. స్త్రీల అక్షరాస్యత తక్కువగా గల జిల్లా- అదిలాబాద్
16. దేశ జనాభాలో రాష్ట్రవాటా-7.37 శాతం
17. జనసాంద్రత-చ.కి.మీ.కు 277 మంది
18. అత్యధిక జనసాంద్రత గల జిల్లా-హైదరాబాద్ (చ.కి.మీ.కు 16,988 మంది)
19. అత్యల్ప జనసాంద్రత గల జిల్లా-అదిలాబాద్ (చ.కి.మీకు 154 మంది)
20. స్త్రీ, పురుష నిష్పత్తి-1,000 మంది పురుషులకు 978 మంది స్త్రీలు
21. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ, పురుష నిష్పత్తి -1000 మంది పురుషులకు 965 మంది స్త్రీలు
22. పట్టణ ప్రాంతాల్లో స్త్రీ, పురుష నిష్పత్తి -1000 మంది పురుషులకు 983 మంది స్త్రీలు
23. అత్యధిక స్త్రీ, పురుష నిష్పత్తి గల జిల్లా - నిజామాబాద్ (1000 మంది పురుషులకు 1017 మంది స్త్రీలు)
24. అత్యల్ప స్త్రీ, పురుష నిష్పత్తి గల జిల్లా- హైదరాబాద్ (1000 మంది పురుషులకు 933 మంది స్త్రీలు)
25. దశాబ్దపు జనాభా వృద్ధిరేటు-14.59 శాతం.
26. రాష్ట్రంలో పట్టణ జనాభా శాతం-27 శాతం
27. రాష్ట్రంలో గ్రామీణ జనాభా శాతం- 73 శాతం
28. అత్యధిక గ్రామీణ జనాభా గల జిల్లా- మహబూబ్‌నగర్
29. జనాభాలో ఆంధ్రప్రదేశ్ స్థానం-5 (7.37 శాతం)
30. వైశాల్యంలో ఆంధ్రప్రదేశ్ స్థానం-4వ స్థానం
31. జనసాంద్రతలో ఆంధ్రప్రదేశ్ స్థానం- 19వ స్థానం (రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాలతో కలిపి)
32. అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ స్థానం- 28వ స్థానం (రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాం తాలతో కలిపి)
33. జనాభా వృద్ధి రేటు అధికంగా ఉన్న జిల్లా-రంగారెడ్డి
34. వైశాల్యంలో పెద్ద జిల్లా-అనంతపూర్.
35. వైశాల్యంలో చిన్న జిల్లా-హైదరాబాద్
36. అధిక శాతం అడవులు గల జిల్లా- ఖమ్మం
37. తక్కువ శాతం అడవులు గల జిల్లా- హైదరాబాద్
38. ఎస్సీలు అధికంగా గల జిల్లా-శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
39. ఎస్టీలు అధికంగా గల జిల్లా-ఖమ్మం

## రవాణా

వస్తువులు, ప్రయాణీకులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేర్చడాన్ని రవాణా అంటారు. పరిశ్రమల నుంచి వస్తువులను వినియోగదారులకు సరఫరా చేయడానికి రవాణా తోడ్పడుతుంది. రవాణాను నాలుగు రకాలుగా విభజించవచ్చు.

1. రోడ్లు, 2. రైల్వేలు, 3. నీటిమార్గాలు, 4. విమాన మార్గాలు.

*1. రోడ్డు మార్గాలు*

రోడ్డు రవాణా ద్వారా వస్తువులు, ప్రయాణీకులను వారి గమ్యస్థానాల వరకు చేరవేయాల్సి ఉంటుంది. రహదార్లు, దేశంలోని రాష్ట్రాలనే కాక ప్రపంచంలోని దేశాలను కూడా కలుపుతున్నాయి. జాతీయ సమైక్యతతో పాటు అంతర్జాతీయ సమైక్యతకు కూడా బాటలు వేశాయి.

రహదారులు వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం తదితర అన్ని రంగాల అభివృద్ధికి చాలా అవసరం. 1943 వరకు రోడ్ల అభివృద్ధికి ఎటువంటి పథకాలు లేవు. ఆ సంవత్సరంలో రహదారుల అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. దీనిని 'నాగ్‌పూర్ ప్రణాళిక' అని అంటారు.

ఉపయోగం, అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారులను నాలుగు రకాలుగా విభజన చేశారు. అవి: జాతీయ రహదారులు, రాష్ట్రీయ రహదారులు, జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులు.

**1. జాతీయ రహదారులు**

ఈ రకమైన రహదారులు రాష్ట్రాల రాజధానులు, ఓడరేవులు, పారిశ్రామిక, గనుల ప్రాంతాలను కలుపుతాయి. వీటిని కేంద్ర ప్రభుత్వం నిర్మించి, నిర్వహిస్తుంది.

**2. రాష్ట్రీయ రహదారులు**

ఇవి రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించి నిర్వహిస్తుంది. ఇవి జిల్లా ముఖ్య పట్టణాలు, పారిశామిక ప్రాం తాలను రాష్ట్ర రాజధానితో కలుపుతాయి.

**3. జిల్లా రహదారులు**

జిల్లా రహదారులు మండల కేంద్రాలను కలుపుతాయి. అలాగే ఉత్పత్తి ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాలను రాష్ట్ర రహదారులు, రైల్వే స్టేషన్‌లతో కలుపుతాయి.

**4. గ్రామ రహదారులు**

ఇవి గ్రామాలను, మండల కేంద్రాలు, జిల్లా రహదారులు, ఇతర గ్రామాలతోను కలుపుతాయి.

రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధి పథకాలను రాష్ట్ర రోడ్లు బిల్డింగ్స్ శాఖ, స్థానిక పరిపాలన శాఖలకు చెందిన ఛీఫ్ఇంజనీర్లు అమలు పరుస్తారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ప్రధాన జిల్లా రహదారులన్నీ రోడ్లు భవనాలశాఖ ఇంజనీరు అధీనంలో ఉం టాయి. మిగిలిన జిల్లా రహదారులు, గ్రామీణ రహదారులన్నీ స్థానిక పరిపాలన శాఖ ఛీఫ్ ఇంజనీర్ అజమాయిషీలో ఉంటాయి. మన రాష్ట్రంలో అన్ని రకాల రహదారుల పొడవు 1,41,000 కి.మీ. పైగా ఉంటుంది. ఈ మొత్తంలో జాతీయ రహదారుల పొడవు సుమారు 3,000 కి.మీ. పైగా ఉంటాయి. మన రాష్ట్రంలో ఐదు జాతీయ రహదారులు (4 ,5,7,9,43) వివిధ ప్రాంతాల గుండాపోతున్నాయి. ఐదవ జాతీయ రహదారి మన రాష్ట్రంలోని నెల్లూరు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి పట్టణాల గుండాపోతుంది. మన రాష్ట్రంలో దీని పొడవు 1,011 కి.మీ. ఇది చెన్నైను కోల్‌కతాతో కలుపుతుంది. ఇది మన రాష్ట్రంలోని జాతీయ రహదారుల్లో అతిపెద్దది. ఏడవ జాతీయ రహదారి అనంతపురం, కర్నూలు, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ గుండా పోతుంది. మనదేశ దక్షిణాగ్రంలో ఉన్న కన్యాకుమారిని, ఉత్తరాదిగల వారణాసిలను ఈ రహదారి కలుపుతుంది. ఇది దేశంలో అతిపొడవైన రహదారి. దేశంలో నాగ్‌పూర్, బెంగళూరు, జబల్‌పూర్ నగరాల మీదుగా ఈ రహదారి పోతుంది. 1956 సంవత్సరంలో మన రాష్ట్రంలో 17,100 కి.మీ. పొడవు రోడ్లు ఉండగా, 1994 సంవత్సరానికి 1,40,999 కి.మీ. రోడ్ల పొడవు ఉంది.

## రైల్వే మార్గాలు

రైల్వేలు దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకలాంటివి. అన్ని రవాణా సౌకర్యాల కంటే, రైలు మార్గాల ద్వారా జరిగే రవాణాకు చాలా ప్రాధాన్యత ఉంది. దేశ రవాణాలో సుమారు 50 శాతం రైల్వేల ఆక్రమించాయి. దేశంలోని ప్రధాన రైలు మార్గాలైన ఢిల్లీ-చెన్నై, బొంబాయి -చెన్నై, కోల్‌కత-మద్రాసు లైన్లు మన రాష్ట్రం గుండా పోతున్నాయి. మన రాష్ట్రంలోని ప్రధాన పారిశ్రామిక, వ్యాపార కేంద్రాలైన విశాఖపట్నం, కొత్తగూడెం, కాకినాడ, మచిలీపట్నం, రాజమండ్రి, కాగజ్‌నగర్, రామగుండం, విజయవాడ, గూడూరు, తిరుపతి, సికింద్రాదాబాద్, హైదరాబాద్‌లను రైలుమార్గాలతో అనుసంధానించారు. సికింద్రాబాద్ దక్షిణ మధ్యరైల్వే ప్రధాన కేంద్ర కార్యాలయం.

## జల మార్గాలు

ఆంధ్రప్రదేశ్‌లోని నదులు, కాలువలు ద్వారా రవాణాకు అనువైన 2747 కి.మీ. మార్గాలున్నాయి. గోదావరి నదీ పరివాహక ప్రదేశంలో 790 కి.మీలు జలమార్గాలు, కృష్ణా నదీ పరివాహక ప్రదేశంలో 644 కి.మీల పొడవు జలమార్గాలు ఉన్నాయి. బకింహామ్ కాలువ మన రాష్ట్రంలో 310 కి.మీ. పొడవుతో ప్రవహిస్తోంది. గోదావరి, కృష్ణా కాలువల్లో ఏడాదిలో పది నెలలు పడవలు తిరిగేందుకు వీలవుతుంది. ఈ కాలువల ద్వారా ప్రధానంగా సరుకులను రవాణా చేస్తారు. ఈ కాలువలు ప్రజల రవాణాకు కూడా అనుకూలమైనవి. అయితే కాలువల్లోని మట్టిని తవ్వకపోతే వర్షాకాలంలో ప్రయాణం చేయటం కష్టమవుతుంది. ఇవన్నీ భౌగోళిక పరిస్థితుల అవరోధాల వల్ల అభివృద్ధి చెందలేదని చెప్పవచ్చు.

మన రాష్ట్రంలో సుమారు 972 కి.మీ. సముద్ర తీరం ఉంది. కాని తీరంలో చీలికలు లేకపోవడం వల్ల మంచి ఓడరేవులు ఏర్పడలేదు. రాష్ట్రంలోని ఓడరేవులను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి: పెద్ద ఓడరేవులు, మధ్యతరహా ఓడరేవులు, చిన్న తరహా ఓడరేవులు. రాష్ట్రంలో విశాఖపట్నం ఒక్కటే సహజ సిద్ధమైన పెద్ద ఓడరేవు. కాకినాడ, మచిలీపట్నం మధ్య తరహా ఓడరేవులు. కళింగ పట్నం, భీముని పట్నం, వాడరేవు, నర్సాపురం, నిజామ్‌పట్నం, కృష్ణపట్నం చిన్న తరహా ఓడరేవులు.

విశాఖపట్నం మన రాష్ట్రంలో ప్రధాన ఓడ రేవు.ముడి ఇనుము, ఆయిల్, చేపలు దిగుమతుల్లో ప్రధానమైనవి. ఇక్కడే దేశంలోనే తొలి నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని పేరు హిందూస్థాన్ షిప్‌యార్డ్. ఇది దేశంలోనే అతి పెద్ద డ్రైడాక్ నౌకానిర్మాణ కేంద్రం. దేశ తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం కూడా ఇక్కడే ఉంది.

## వాయు మార్గాలు

మన రాష్ట్రంలో ప్రైవేటు రంగంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని హైదరాబాద్‌కు సమీపంలోని శంషాబాద్‌లో నిర్మించారు. దీనిని జీఎంఆర్ కంపెనీ నిర్మించి, నిర్వహిస్తోంది. విశాఖపట్నంలోని విమానాశ్రయాన్ని అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రభుత్వం ప్రకటించింది. అదే విధంగా తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయాన్ని కూడా అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించారు. విజయవాడ సమీపంలోని గన్నవరంలో మరొక విమానాశ్రయం ఉంది. ఇవి కాక వరంగల్, రాజమండ్రి పట్టాణాల్లో కూడా చిన్న విమానాశ్రయాలు ఉన్నాయి.